3 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ



చింతకాని, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండలం పందిళ్లపల్లి ర్యాక్ పాయింట్‌లో సోమవారం యూరియా, కాంప్లెక్స్ ఎరువుల పంపిణీని టెక్నికల్ ఏవో పవన్‌కుమార్ పరిశీలించారు. ర్యాక్ పాయింట్‌కు 3107.16 మెట్రిక్ టన్నుల యూరియా రాగా.. ఖమ్మానికి 1517.16, భద్రాద్రి కొత్తగూడెం 500, మహబూబాబాద్ 800, సీఆర్‌పీ 200 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించినట్లు తెలిపారు.



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల, నందమూరి రామకృష్ణ, టీడీ జనార్దన్

ఎన్టీఆర్ చూపిన బాటలో నడిచినవారికి..

రాజకీయాల్లో తిరుగుండదు

- తెలుగు జాతి గర్వించదగిన మహనీయుడు ఆయన
- ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో మంత్రి తుమ్మల
- నందమూరి రామకృష్ణతో కలిసి హాజరు
- దారుకబంజరలో సందడి వాతావరణం



కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి గర్వించదగిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని, ఆయన చూపిన బాటలో నడిచిన వారికి రాజకీయాల్లో ఎన్నటికీ తిరుగుండదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కల్లూరు మండలంలోని దారుకబంజర గ్రామంలో నందమూరి అభిమానులు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహన్ని ఆయన సోమవారం ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల కాలంలో అధికారంలోకి తెచ్చి రాజకీయ చరిత్రను మలుపు తిప్పిన ఘనుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాలకు అధికారం వచ్చిందన్నారు, తాను ఎన్టీఆర్ శిష్యుడిగా 1982 నుంచి నేటి వరకు ప్రజలకు సేవలు అందిస్తూ ముందుకు సాగుతున్నానన్నారు. ఏ గ్రామంలో అభివృద్ధి జరిగినా అది టీడీపీ పాలనలోనే జరిగిందన్నారు. నేటి రాజకీయల్లో అవినీతి, కుచిలతత్వం పెరిగినా ఎన్టీఆర్ శిష్యుడిగా తాను నీతినిజాయితీలతో రాష్ట్రం, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణలో రానున్న కాలంలో టీడీపీ జెండా రెపరెపలాడుతుందన్నారు. రాజకీయ, చలనచిత్ర రంగాల్లో రాణించి ప్రపంచ రాజకీయ చిత్రపటంలో రికార్డులు సాధించిన మహనీయుడు ఎన్టీఆర్ ఒక్కరేనన్నారు. తెలుగు జాతి ఉన్నంత కాలం ఆయన ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. ఈ సభలో ఎన్టీఆర్ ట్రస్టు భవన్ ఇన్‌చార్జ్ టీడీ జనార్దన్, స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఏపీలోని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, టీడీపీ సీనియర్ (మిగతా 6వ పేజీలో)

అధికార యంత్రాంగం పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిచేసి గెజిట్ విడుదల చేయడంతో రాజకీయ పార్టీలు మళ్లీ పంచాయతీ ఎన్నికలపై దృష్టిసారించాయి. సెప్టెంబరులో చేసిన రిజర్వేషన్ల ప్రక్రియకు ప్రస్తుత రిజర్వేషన్లకు జనరల్, బీసీ రిజర్వేషన్ల మార్పులు, చేర్పులు జరిగాయి. తాజాగా ఇచ్చిన రిజర్వేషన్లను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాలు ఎన్నికలపై దృష్టిసారించాయి. తమ గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థికి అర్హత ఉన్న అభ్యర్థుల కోసం వేట మొదలు పెట్టాయి. ఎన్నికల నిర్వహణ తేదీల ఖరారు కోసం పార్టీలు ఎదురుచూస్తున్నాయి. జనరల్, బీసీ రిజర్వ్‌డ్ స్థానాల్లో గట్టి పోటీ కనిపిస్తుండగా.. ఆయా మండలాల్లో పార్టీ నాయకులు ఎవరికివారు స్వచ్ఛందంగానే సమావేశాలు నిర్వహించి గెలిచే సత్తా ఉన్న అభ్యర్థుల జాబితా సిద్ధం చేస్తున్నాయి.



అభ్యర్థుల వేటలో..

- పంచాయతీ పోరుకు సిద్ధమవుతున్న పార్టీలు
- ఎన్నికల ముహూర్తానికి ఎదురుచూపు

ఖమ్మం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గతసారి 50శాతం రిజర్వేషన్లకు మించి నిర్వహించడంతో సుప్రీంకోర్టు బ్రేకువేసిన విషయం తెలిసిందే. ఈసారి 50శాతానికి లోబడి ఎన్నికలు జరుగుతున్నందున తాజా రిజర్వేషన్లతో ఎన్నికల నిర్వహణ గ్యారంటీ అని రాజకీయపార్టీలు ఈసారి పట్టుదలగా ఉన్నాయి. భవిష్యత్ పార్టీల కార్యక్రమాలకు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సహకార ఎన్నికలకు పంచాయతీ స్థాయిలో సర్పంచ్‌లు, వార్డు నేతలు కీలకం కాబోతున్నందున ఈ ఎన్నికలు పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారబోతున్నాయి. ఇటు ఉమ్మడి జిల్లాలో ప్రధాన పార్టీల దృష్టంతా పంచాయతీ ఎన్నికలపై నెలకొంది. ఎవరికివారు తమతమ మండల నాయకులకు అర్హుల జాబితాలు సిద్ధంచేయాలని, మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలని సూచనలు చేస్తున్నారు. ఖమ్మంజిల్లాలో 571పంచాయతీలు, 5214వార్డులున్నాయి. ఇందుకు సంబంధించి రిజర్వేషన్ల గెజిట్‌ను విడుదల చేయడం జరిగింది. మహిళలకు 260 , జనరల్‌కు 311 పంచాయతీలను కేటాయించారు.

వార్డుల రిజర్వేషన్లు ఇలా..

పంచాయతీల వారీగా 5,214 వార్డులకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. జిల్లా వ్యాప్తంగా 571పంచాయతీల్లో ఎస్టీలకు 171, ఎస్సీలు 110, బీసీలకు 54, జనరల్‌కు 236 రిజర్వ అయ్యాయి. వీటిలో షెడ్యూల్ ప్రాంతంలోని 99పంచాయతీలకు 99సర్పంచ్‌లు గిరిజనులకే రిజర్వు అయ్యాయి. ఇందులో ఎస్టీ మహిళ 48, 51ఎస్టీజనరల్‌కు రిజర్వు చేశారు. 11 పూర్తిగా గిరిజన తండాల్లో ఓటర్లు ఉన్నందున అందులో 8ఎస్టీ జనరల్, 3 ఎస్టీ మహిళకు రిజర్వు అయ్యాయి. ఇక మైదాన ప్రాంతంలో ఎస్టీకి 61పంచాయతీలు రిజర్వుకాగా, అందులో ఎస్టీ మహిళకు 25, ఎస్టీజనరల్36, ఎస్సీలకు 110 రిజర్వుకాగా ఎస్సీ మహిళలకు 48, ఎస్సీ జనరల్ 62, బీసీలకు 54రిజర్వుకాగా బీసీ మహిళ 24, బీసీ జనరల్30 సర్పంచ్‌లు రిజర్వు అయ్యాయి. మొత్తంమీద 236పంచాయతీలు జనరల్‌కాగా ఇందులో జనరల్ మహిళ 112, జనరల్ 124 రిజర్వు అయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 471పంచాయతీలకుగాను 460 ఎస్టీలకు రిజర్వు కాగా, 11 పంచాయతీల్లో జనరల్ 5, జనరల్ మహిళకు 4, ఎస్సీలకు 2 రిజర్వ్ అయ్యాయి. వీటి ఆధారంగా ప్రధానపార్టీలు అభ్యర్థుల వేట ప్రారంభించాయి. ఆర్థిక, కుల బలం ఉన్న వారిని పార్టీలు ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. ఎన్నికల షెడ్యూల్ మంత్రివర్గం నిర్ణయం అనుసారం ఎన్నికల కమిషన్ నిర్ణయించబోతోంది. ఇందుకోసం పార్టీలు ఎదురుచూస్తున్నాయి. ఈలోపు అభ్యర్థుల కసరత్తును పూర్తిచేసే పనిలో పార్టీలున్నాయి. గ్రామాల్లో ఆర్థికస్థోమత, సేవాభావంతోపాటు అందరిలో గుర్తింపు ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వబోతున్నాయి.

ఆయకట్టులో అయోమయం

- యాసంగి నీటిప్రణాళిక ప్రకటించని సాగర్ అధికారులు
- పూర్తికావొచ్చిన



కూసుమంచి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ రెండో జోన్ పరిధిలోని ఖమ్మంజిల్లా ఆయకట్టు రైతుల్లో అయోమయం నెలకొంది. యాసంగి సాగుకు అవసరమైన నీటి ప్రణాళికపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఈపరిస్థితి నెలకొంది. ఇప్పటికే వానాకాలం పంట కోతలు పూర్తికావొస్తున్నాయి. యాసంగిపంట సాగుకు గాను అధికారులు నీటివిడుదలపై స్పష్టత ఇస్తే అందుకు అనుగుణంగా నార్లు పోస్తూకుంటారు. బోర్లు, బావులు ఆధారంగా ఉన్నవారు నార్లు పోసుకుంటుండగా, నీటి ఆధారం లేని సాగర్ నీటి ఆధారపడిన రైతులకు ప్రణాళిక తప్పనిసరి అవసరమవుతుంది. ఖమ్మం జిల్లాలో సాగర్ రెండోజోన్ ఆయకట్టులో సుమారు 2.55 లక్షల ఎకరాల్లో యాసంగి సాగుచేస్తుంటారు. 32టీఎంసీల నీరు అవసరం ఉంటుంది. వీటితోపాటు పాలేరు జలాశయం ఆధారంగా ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు భగీరథ ప్రాజెక్టు ద్వారా తాగునీటి అవసరాలకు నీరు అవసరం ఉంటుంది. ఏటా యాసంగిలో డిసెంబరు మొదటివారంలో యాసంగి నీరు విడుదల చేయడం ఆనవాయితీగా వస్తోంది. వారబందీ ప్రకారం నీరువిడుదల చేస్తారు. మొదటి నెల రోజులు నిరంతరంగా, నాట్లు పూర్తయ్యాక వారబందీ ప్రకారం తొమ్మిది రోజులు విడుదల, ఆరురోజులు నీటినిలుపుదల పద్ధతిలో నీరు విడుదల చేస్తుంటారు. తద్వారా నీటిపొదుపుతోపాటు పంటల దిగుబడిపై ప్రబావం చూపుతాయి. దీంతో పాటు రైతులు నీటిని పొదుపుగా వాడుకునే అలవాటు పెరుగుతుంది. ఈఏడాది వర్షాకాలం సీజన్ మొత్తం భారీ వర్షాలు కురవడంతో (మిగతా 8వ పేజీలో)

భూ వివాదంలో కత్తులతో దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఖమ్మం ఆస్పత్రికి తరలింపు
- భద్రాద్రి జిల్లా నారంవారిగూడెంలో ఘటన 7

నిర్మాణంలోనే కూలిన హైలెవల్ వంతెన పిల్లర్

- ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం
- నాసిరకం నిర్మాణంతోనే కూలిందని స్థానికుల ఆరోపణ
- డిప్యూటీ సీఎం భట్టి స్వగ్రామంలోనే ఘటన 6



సింగరేణి మహిళా కళాశాల

అధ్యాపకుల మధ్య ఆధిపత్య పోరు

- సింగరేణి జూనియర్ కళాశాలలో కుమ్ములాటలు
- జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు
- విచారణ ప్రారంభించిన పోలీసులు 7

బొట్టు పెట్టి.. చీర పెట్టి

- రఘునాథపాలెం మండలంలో వినూత్నంగా ఇందిరమ్మ చీరల పంపిణీ
- మంత్రి తుమ్మల ఆదేశాలతో ప్రత్యేక కార్యక్రమం

ఖమ్మం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విషయం తెలిసిందే. మూడురోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం మంగళవారం ముగియనుండగా.. వ్యవసాయ, చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో రఘునాథపాలెం మండలంలో ఈ చీరల పంపిణీని వినూత్నంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు.

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు.. స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు సంఘాల సభ్యుల ఇళ్లకు వెళ్లి బొట్టుపెట్టి ఇందిరమ్మ చీరలను అందిస్తున్నారు. ఆదివారం ప్రారంభించిన ఈ కార్యక్రమంలో మూడురోజులపాటు మండలంలో 37 గ్రామ పంచాయతీల్లో 22వేల మంది మహిళలకు 22వేల చీరలను అందిస్తున్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన ప్రతీ పేద మహిళకు ఈ ఇందిరమ్మ చీరలను అందించాలని భావిస్తున్న నేపథ్యంలో రఘునాథపాలెం మండలం ఓ మోడల్‌గా సిరిసిల్ల చేనేత చీరలను అందించాలని, పుట్టింటి చీర ఆడబిడ్డకు పెడితే ఎంత ఆనందం ఉంటుందో అదే తరహాలో ప్రతీ మహిళ ఆనందం పొందాలన్న లక్ష్యంతో మంత్రి తుమ్మల ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. అయితే ఇలా తమ ఇళ్లకు వచ్చి బొట్టుపెట్టి చీర అందించడంపట్ల మహిళలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రఘునాథపాలెంలో బొట్టు పెట్టి చీర అందిస్తున్న దృశ్యం

ఏసీబీకి చిక్కిన మధిర

లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్

రూ.15వేల లంచం తీసుకుంటుండగా అరెస్టు



చందర్

మధిర రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీమా సొమ్ముకు దరఖాస్తు చేసుకునే క్రమంలో భవన నిర్మాణ కార్మికుడి కుటుంబం నుంచి లంచం తీసుకుంటూ మధిర లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ ఏసీబీ అధికారులకు చిక్కిన సంఘటన సోమవారం సాయంత్రం ఖమ్మం జిల్లా మధిరలో జరిగింది. మధిరలోని లేబర్ కార్యాలయంపై సోమవారం సాయంత్రం ఏసీబీ అధికారులు దాడి చేశారు. ఓ బాధితుడి నుంచి రూ.15వేలు లంచం తీసుకుంటున్న మధిర లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ కొర్నే చందర్‌ను ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గతేడాది మధిరలో ఓ భవన నిర్మాణ కార్మికుడు సహజ మరణం పొందాడు. భవన కార్మికులకు న్యాచురల్ డెత్ బెనిఫిట్ స్కీం కింద రూ.1.30లక్షల బీమా నగదు వస్తుంది. దీంతో ఆ భవన నిర్మాణ కార్మికుడి కుటుంబం దరఖాస్తు చేసుకొనేందుకు లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ చందర్‌ను సంప్రదించారు. డెత్ సర్టిఫికెట్, ఇతర వివరాలు, పత్రాలను అందజేస్తే పై అధికారులకు పంపాల్సి ఉంటుందని, అందుకు రూ.30వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులు ఖమ్మం ఏసీబీ వై.రమేష్‌కు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత అధికారుల సూచనల మేరకు బాధిత కుటుంబం కార్యాలయానికి వెళ్లి చందర్‌కు రూ.15వేలను ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. చందర్ లంచం తీసుకున్నట్లు నిర్ధారణ కావడంతో అరెస్టు చేశామని, నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు.

మాట్లాడుతున్న పశ్య పద్మ, పక్కన బాగం హేమంతరావు, తదితరులు



కమ్యూనిస్టు పోరాటాలతోనే

ప్రజల హక్కులు

- వందేళ్ల చరిత్ర త్యాగమయం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మ
- ఖమ్మం చేరిన ప్రచార జాత

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టుల పోరాటాలతోనే ప్రజలకు హక్కులు వచ్చాయని, ప్రజా సమస్యలు ఉన్నంత కాలం బడుగు బలహీనవర్గాలను కార్పొరేట్ శక్తులు దోచుకున్నంత కాలం కమ్యూనిస్టు పార్టీలు ఉంటాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పేర్కొన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్మల్ జిల్లా బాసరలో ప్రారంభమైన ప్రచార జాత సోమవారం ఖమ్మం నగరానికి చేరుకొంది. ఈ సందర్భంగా పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆధ్వర్యంలో జాతాకు ఘనస్వాగతం పలికారు. సాయంత్రం ఖమ్మం నగరంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ వందేళ్ల సీపీఐ చరిత్ర ఎన్నో త్యాగాలతో కూడి ఉందని వివరించారు. స్వాతంత్ర్యానికి పూర్వమే దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిందని ఇప్పుడు దేశభక్తి గురించి నీతులు చెప్పే పార్టీలు స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. కమ్యూనిస్టు పార్టీ నిర్బంధాలను ఎదుర్కొని కమ్యూనిస్టు పార్టీ నిలబడిందన్నారు. బాగం హేమంతరావు మాట్లాడుతూ డిసెంబరు 26న ఖమ్మంలో నిర్వహించే శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అర్జీలను స్వీకరించి..

సత్వరమే పరిష్కరించాలి..

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ అనుదీప్
- ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ప్రతి దరఖాస్తును పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ యం. అపూర్వ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందిన ఫిర్యాదుల్లో కొన్ని..

● పూర్వం మధిర తాలూకాలో ఉన్న గ్రామపంచాయతీలను కూడా ఏజెన్సీ ప్రాంతాలుగా గుర్తించడం వల్ల సుమారు 40 గ్రామాల్లో ఇబ్బందికరంగా మారిందని ఏన్కూరు మండలానికి చెందిన పలువురు రైతులు సోమవారం కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. అప్పట్లో మధిర తాలూకాలో ఉన్న ప్రాంతాలపై విచారించాలని గ్రామ పంచాయతీ ఎన్నికలకు ముందే ఈ గ్రామాలకు ఏజెన్సీ నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ మేరకు కోర్టు కూడా డైరెక్షన్ ఇచ్చిందని తాము ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకం కాదని, కానీ అనివార్యంగా 40 గ్రామాలను ఏజెన్సీ ప్రాంతాలుగా గుర్తించడం వల్ల నష్టపోతున్నామంటూ వారు కలెక్టర్‌కు విన్నవించారు.

● రఘునాథపాలెం మండలానికి చెందిన వెంకటేశ్వర్లు తమకు 2009లో సర్వే నెంబర్ 218లో 75 చదరపు గజాల ప్లాట్ కేటాయించారని, క్షేత్రస్థాయిలో తనకు కేటాయించిన జాగాను చూపించడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● ఖమ్మంరూరల్ మండలం వెంకటగిరి, గుదిమళ్ల గ్రామ ప్రజలు ఇటీవల ఏదులాపురం మునిసిపాలిటీలో తమ గ్రామాలను విలీనం చేశారని, తమ గ్రామాల్లో అత్యధికంగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉంటారని, ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రజలపై దుష్పరిణామాలు ఎదురవుతున్నాయని, దానిని రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు.

● ఎర్రుపాలెం రెవెన్యూ గ్రామానికి చెందిన బాలయ్య గ్రామంలో కేజీబీవీ ఎదురుగా గ్రామకంఠ భూమి అన్యాక్రాంతమవుతుందని దానిని కాపాడాలని ఫిర్యాదు చేశాడు.

1,710.72 హెక్టార్లు

- ఇదీ 'మొంథా'ర్పణమైన పంటల లెక్క
- వివరాల సేకరణ పూర్తి.. ప్రభుత్వానికి తుది నివేదిక
- 17 మండలాల్లో 4,268 రైతులకు నష్టం

ఖమ్మం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మొంథా తుఫాన్ మిగిల్చిన పంట నష్టం లెక్కలు తేలాయి. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల వారీగా సర్వే నిర్వహించి సర్వేనంబర్ల వారీగా నష్టపోయిన పంటల వివరాలుసేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించారు. జిల్లాలోని 17మండలాల్లో 4,268మంది రైతులు 1710.72హెక్టార్లలో పంటలు నష్టపోయారు. ఇందుకుగాను ఎకరానికి రూ.10వేల చొప్పున సుమారు రూ.4.22కోట్లకుపైగా సొమ్మును రైతులకు పరిహారంగా అందించనున్నారు. జిల్లాలో మొత్తంగా కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, ఎర్రుపాలెం, కల్లూరు రఘునాధపాలెం, వైరా మండలాల్లో అధికనష్టం జరిగింది. నేలకొండపల్లి, సత్తుపల్లి, ఖమ్మంఅర్బన్, పెనుబల్లి, మధిర, ముదిగొండ తదితర మండలాల్లోకూడా పంటల నష్టం జరిగింది. అయితేమొదట భారీవర్షాల తరుణంలో సుమారు 60వేల ఎకరాల్లోపంటనష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా వేసినప్పటికి ఆవెంటనే వాతావరణంలో మార్పుతో ఎండలుకాయడంతో నష్టం ప్రభావం తగ్గింది. దీంతో వ్యవసాయశాఖ నిబంధనలు ప్రకారం పంటలు అధికంగా నష్టపోయిన రైతుల జాబితా అందించి నివేదిక పంపించారు.

రైతులు	హెక్టార్లు	పంట	అందనున్నపరిహారం
3,724	1,499.43హెక్టార్లు	వరి	రూ.3.70కోట్లు
371	115.82హెక్టార్లు	పత్తి	రూ.2.86కోట్లు
216	59.83హెక్టార్లు	మిర్చి	రూ.1.47కోట్లు
42	25.60హెక్టార్లు	మినుము	రూ.6,57,227
19	8.24హెక్టార్లు	పెసర	రూ.2,15,992
ఇద్దరు	అర ఎకరం	టమాటో	రూ.7,500

పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

» సీఐటీయూ రాష్ట్ర నాయకుడు మధు

మణుగూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 పాత కార్మిక చట్టాలను వెంటనే పునరుద్ధరించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు మధు డిమాండ్ చేశారు. సోమవారం మణుగూరు పట్టణంలోని కిన్నెర కళ్యాణ మండంలో రెండో రోజు జరిగిన సీఐటీయూ జిల్లా మహాసభలో పాల్గొని మాట్లాడారు. కార్మిక హక్కులకు భంగం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మికులకు న్యాయం జరిగేంత వరకు సీఐటియూ ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బ్రహ్మచారి, కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షులుగా పిట్టల పద్మ, అర్జున్, గద్దల శ్రీనివాసరావు, ఎస్‌ఎ నబీ, దొడ్డా రవికుమార్, వెంకటరాజు, ఈసం వెంకటమ్మ, సహాయ కార్యదర్శులుగా సత్య, ధనలక్ష్మి, భూక్యా రమేష్, విజయగిరి శ్రీనివాస్, వజ్జా సుశీల, బండారు శరత్, రాజేష్, సభ్యులను ఎన్నుకున్నారు. మధు, శ్రీనివాసరావు, సాంబశివరావు, నెల్లూరి నాగేశ్వరరావు, గోడిశాల రాములు, పిట్టల నాగమణి తదితరులున్నారు.

ఖమ్మం జిల్లా కబడ్డీ జట్లు సిద్ధం



ఎంపికైన బాలికల జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జూనియర్ బాలుర, బాలికల జిల్లా కబడ్డీ జట్లను ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా బాలురు 160మంది, బాలికలు 90 మంది మొత్తం 250 మంది పాల్గొన్నారు. ఈ సదర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపి జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి క్రిష్టఫర్‌బాబు ప్రకటించారు. బాలుర జట్టు డిసెంబరు 5 నుంచి మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర పోటీలలో, బాలికల జట్టు డిసెంబరు 2 నుంచి హాలియాలో జరిగే రాష్ట్ర పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికలను వ్యాయామ ఉపాధ్యాయులు లాలయ్య, నాగప్రసాద్, సత్యానారాయణ, శేఖర్ శ్రీను, గోపి, శివజ్యోతి, శివకృష్ణ, సత్యస్వరూపిణి, ప్రవీణ్ తదితరులు సమీక్షించారు.

ఏకలవ్య పాఠశాలల్లో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్/కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల్లో నియామకానికి కోసం అర్హత కలిగిన బోదన బోదనేతర సిబ్బంది నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. టీజీటీ ఇంగ్లీషు-1 పోస్టుకు డిగ్రీలో 50 శాతం మార్కులతో పాటు బీఈడీ సీటెట్ పేపరు-2, తెలంగాణ టెట్ పరీక్ష పాసై ఉండాలన్నారు. లైబ్రేరియన్ పోస్టుకు డిగ్రీతో పాటు బీఎల్ఐఎస్, ఎంఎల్ఐఎస్ పూర్తి చేసి ఉండాలన్నారు. సెక్యూరిటీ గార్డులు పురుషులు 24 పోస్టుల్లో పదో తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ల్యాబ్ అటెండర్ ఒక పోస్టుకు పదో తరగతి పాసై ఉండాలని, మెస్ హెల్పర్ పురుషులు 12 పోస్టులు, స్ర్తీలు ఆరు పోస్టులు, ఉన్నట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థుల నుంచి 25 నుంచి డిసెంబరు 12వ తేదీలోపు దగ్గరలోని ఏకలవ్య పాఠశాలలో సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు 9000309979 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

నిర్మాణంలోనే కూలిన హైలెవల్ వంతెన పిల్లర్



నిర్మాణంలో ఉన్న వంతెన
(ఇన్‌సెట్‌లో కూలిపోయిన పిల్లర్)

వైరా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా వైరా మండలంలోని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామం అయిన స్నానాల లక్ష్మీపురం వద్ద వైరా నదిపై చేపట్టిన హైలెవల్ వంతెనకు చెందిన ఒక పిల్లర్ సోమవారం నిట్టనిలువునా కుప్పకూలిపోయింది. ఆసమయంలో కూలీలు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిపోయింది. నాసిరక నిర్మాణంతో ఈ పిల్లర్ కూలిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే పిల్లర్ చుట్టూ ఉన్న మట్టిని తొలగించే సమయంలో ఎక్స్‌కవేటర్ ఢీకొనడంతో ఈ పిల్లర్ కూలిపోయిందని ఆర్‌అండ్‌బీ అధికారులు పొంతన లేని వివరణ ఇచ్చారు.

మండలంలోని కనకగిరి సిరిపురం-స్నానాల లక్ష్మీపురం గ్రామాల మధ్య ఉన్న వైరా నదిపై ర్యాఫ్ట్ పద్దతిలో దాదాపు రూ.ఆరుకోట్ల వ్యయంతో ఈ హైలెవల్ వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. సిరిపురం నుంచి స్నానాల లక్ష్మీపురం, గండగలపాడు మీదుగా జాతీయ ప్రధాన రహదారి వరకు రూ.31కోట్లతో రెండు వరుసల రోడ్డు అభివృద్ధితోపాటు వైరా నదిపై ఈ హైలెవల్ వంతెన నిర్మిస్తున్నారు. వైరా నదిపై వంతెన నిర్మాణాన్ని 2013నుంచి భట్టి విక్రమార్క ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఆయన డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలోనే నిధులు మంజూరు చేయించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో అప్పటి ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. కొంత నిర్మాణం అనంతరం ఒక హైలెవల్ వంతెన మొత్తం పూర్తిగా మిగిలిపోయింది. భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం అయిన వెంటనే అసంపూర్తిగా ఉన్న వంతెన స్థానంలో దాని సమీపంలోనే కొత్త హైలెవల్ వంతెన నిర్మాణాన్ని ప్రారంభించారు. రెండు అబిట్‌మెంట్లు సహా 13పిల్లర్లతో ఈ వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. ఇప్పటివరకు 12 పిల్లర్లు నిర్మించారు. ఇంకో పిల్లర్‌ను మాత్రమే నిర్మించాల్సి ఉంది. అయితే ఈ దశలోనే సిరిపురం వైపు ఒక పిల్లర్ కుప్పకూలిపోయింది. బురదలో పిల్లర్ కూలిపోవడడంతో దాని ఆనవాలు కూడా కన్పించని పరిస్థితి. స్నానాల లక్ష్మీపురం వైపు ఇప్పటికే పిల్లర్లపైన స్లాబ్ నిర్మాణం చేపట్టారు. ఈ దశలో ఒక పిల్లర్ కుప్పకూలిపోవడంతో ఈ నిర్మాణంలో నాణ్యతపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ వంతెన నిర్మాణ పనులపై నాణ్యతాప్రమాణాలను తనిఖీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చిన్నచిత్రాలకు తెలంగాణలో ఆదరణ

» రాజు వెడ్స్ రాంబాయి చిత్ర యూనిట్‌కు ఇల్లెందులో ఘనంగా సన్మానం



విలేకరులతో మాట్లాడుతున్న చిత్రయూనిట్

ఇల్లెందు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో చిన్న చిత్రాలకు ఆదరణ ఉందని రాజు వెడ్స్ రాంబాయి చిత్రం మళ్లీ రుజువు చేసిందని ఆ చిత్ర దర్శకుడు కాంపాటి సాయిలు అలియాస్ జగదీశ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఇల్లెందు సీతారామ థియేటర్‌కు చిత్ర యూనిట్ రాగా.. వారికి అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. చిత్ర దర్శకుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ప్రాంతానికి చెందిన కాంపాటి సాయిలు మాట్లాడుతూ తన బాల్యంలో ఇదే సినిమా టాకీస్‌లో సినిమాలు చూసేందుకు కొమరారం నుంచి వచ్చేవాడినని నేడు ఇదే టాకీస్‌లో సన్మానాలు అందుకోవడం అనందంగా ఉందన్నారు. హీరో అఖిల్‌రాజ్ మాట్లాడుతూ తమకు గ్రామీణ ఇతివృత్తంతో నటించిన తొలి సినిమాలోనే ప్రేక్షకుల మన్ననలు పొందడటం తన అదృష్టమన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ తేజస్వీరావు, సినిమాకు పాటలందించిన ప్రజాకవి మిట్టపల్లి సురేశ్, సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి, నటులు చైతు జొన్నలగడ్డ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భ ంగా మిట్టపల్లి సురేష్ తన శైలిలో 'రాజ్యమేదీ లేదుగాని రాణిలాగ చూసుకుంటా..కోట కట్టలేనుగాని కళ్లల్లో నిన్నే దాచుకుంటా' అంటూ ఈ సినిమాలోని పాటను ఆలపించగా.. ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. అయితే చిత్ర దర్శకుడు కాంపాటి సాయిలు అలియాస్ జగదీశ్ ఇల్లెందు మండలం కొమరారం గ్రామానికి చెందిన వ్యక్తి. ప్రజాసాహిత్యం, సినిమాలపై అభిరుచితో కొద్ది సంవత్సరాలుగా హైదరాబాద్‌లోనే సినీపరిశ్రమలో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాజువెడ్స్ రాంబాయి సినిమాను అధిక భాగం ఇల్లెందు, బయ్యారం, గుండాల మండలాల అటవీగ్రామాల్లోనే చిత్రీకరించారు.

వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలి : డిప్యూటీ సీఎం

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, సమగ్ర సమన్వయంతో ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు విక్రమార్క మల్లు కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ మొత్తం 3.50 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 304 కోట్ల విలువైన వడ్డీ లేని రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారని, ముందస్తుగా సమాచారం అందించి సమన్వయాన్ని బలోపేతం చేయాలని చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్‌కు సూచించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం ఈ పథకాన్ని మరోసారి విస్తృతంగా పునరుద్ధరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రెండు, మూడు విడతలుగా రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ చేసినట్లు, రేపు మరోసారి పెద్ద ఎత్తున ఈ రుణాలను అందించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్లు అత్యంత విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐదు నుంచి 10వ తరగతి వరకు చదివే షెడ్యూల్ కులాల విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సోమవారం ఏ. శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కసారి మాత్రమే స్కాలర్‌షిప్ పొందడానికి అర్హులని తెలిపారు. ఈ స్కాలర్‌షిప్ బాలురకు ఏడాదికి రూ. 1,000, బాలికలకురూ. 1,500 చెల్లిస్తారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు వార్షిక ఆదాయం రూ. రెండులక్షల 50 వేలకు మించి ఉండరాదు. అదేవిధంగా రాజీవ్ విద్యా దీవెన పథకంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9, 10 తరగతిలో చదివి విద్యార్థులు స్కాలర్షిప్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వీలు కలుగుతుందని తెలిపారు. ఈ స్కాలర్‌షిప్ కోసం మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో లక్ష్మీపురం విద్యార్థి ప్రతిభ



విద్యార్థి సునీతను అభినందిస్తున్న ఎస్‌వో

ముదిగొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం కేజీబీవీ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ చదువుతున్న బాణోతు సునీత నేషనల్ యూత్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ నిర్వహించిన నేషనల్ యూ త్ గేమ్స్ చాంపియన్ షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిథ్యం వహించింది. ఈనెల 8నుంచి 10వరకు గోవాలో జరిగిన ఈ పోటీల్లో అండర్-17విభాగంలో కబడ్డీ పోటీల్లో నాలుగు రాష్ట్రాల స్థాయిలో ప్రతిభ కనపర్చి సిల్వర్ మెడల్‌ను దక్కించుకుంది. ఈ సందర్భంగా సునీతను కళాశాల స్పెషలాఫీసర్ బండారి ఇందిరా, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ....



దుమ్ముగూడెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో 11వ తెలంగాణా రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ 2025-26 పోటీల్లో దుమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్ధి పొడకలపల్లి అశ్రిత్ దివాకర్ సిల్వర్ మెడల్ గెల్చుకున్నాడు. క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా మెడల్ అందుకున్నాడు. ఈనెల 21న ప్రారంభమైన పోటీలు 23న ముగిసాయి. కోచ్ పి.చైతన్య, టీం మేనేజర్ జి.విజయ్‌కుమార్, ఇంచార్జి హెచ్‌ఎం కోటేశ్వరి, ఎంఈవో సమ్మయ్య, పాఠశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు.



కలెక్టర్ ద్వారా అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం సరిత

అశ్వారావుపేట పాఠశాలకు జల భగీరథ అవార్డు

అశ్వారావుపేట రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జల సంచయ్ జన్ భగీరథ అవార్డు లభించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు జల సంరక్షణ కోసం పాఠశాల ఆవరణలో అధికంగా ఇంకుడు గుంతలను నిర్మించి భూగర్భ జలాలను రక్షించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలో అత్యధికంగా ఇంకుడు గుంతలను నిర్మించారు. ఈ మేరకు పాఠశాలను జల భగీరథ అవార్డుకు ఎంపిక చేశారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో హెచ్‌ఎం పి.హరితకు కలెక్టర్ జితేశ్ పాటిల్ అవార్డును అందించారు. పాఠశాలకు అవార్డు రావటం పట్ల ఎంఈవో ప్రసాదరావుతో పాటు పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

భద్రాద్రి వైద్యుడి డిజిటల్ అరెస్టు!

» మూడురోజుల పాటు కుటుంబమంతా ఇంట్లోనే

» సహాయకుడిచ్చిన సమాచారంతో రక్షించిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో

భద్రాచలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు విధించిన డిజిటల్ అరెస్టు నుంచి భద్రాచలంలోని ఓ ప్రైవేటు వైద్యుడు, ఆయన కుటుంబాన్ని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కాపాడింది. భద్రాచలానికి చెందిన ఓ వైద్యుడు తన కోడలు, మనవరాలితో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో 20వ తేదీన ఆ వైద్యుడికి వాట్సాప్ కాల్ చేసిన వ్యక్తులు తాము సీబీఐ అధికారులమని పరిచయం చేసుకున్నారు. మీ ఆధార్‌తో ముంబైలో తెరిచిన బ్యాంకు ఖాతాను దర్యాప్తు చేశామని, ఆ ఖాతాకు 100కి పైగా క్రిమినల్ కేసులతో సంబంధం ఉందని తేలిందని భయపెట్టారు. మీరు సీబీఐ నిఘాలో ఉన్నారు.. విచారణ కోసం ప్రతీగంటకు వీడియో కాల్ చేస్తూ ఉంటామని, ఈ విషయం కుటుంబం నుంచి ఎవరూ బయటకు చెప్పొద్దని, అసలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లొద్దని భయపెట్టారు. ఈ క్రమంలో పలుమార్లు కాల్స్ చేసిన సైబర్ నేరగాళ్లు డాక్టర్ నుంచి బ్యాంకు ఖాతాల సమాచారాన్ని అడగ్గా.. కొన్ని ప్రశ్నలకే సమాధానమిచ్చారు. అయితే 20వ తేదీ నుంచి వైద్యుడు ఆస్పత్రికి వెళ్లకపోవడం, కుటుంబంలోని వారు ఫోన్ కాల్స్ అటెండ్ చేయకపోవడంతో వారి సహాయకుడికి అనుమానం వచ్చింది. వైద్యుడికి ఫోన్ చేయగా విషయం చెప్పడంతో అతడు ఈ నెల 23న జిల్లా సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ డీఎస్పీ అశోక్ బాబుకు సమాచారం అందించాడు. దీంతో డీఎస్పీ అశోక్ బాబు, ఇన్‌స్పెక్టర్ జితేందర్ ఆ వైద్యుడి నివాసానికి చేరుకుని వైద్యుడు, ఆయన కోడలు, మనవరాలిని కాపాడారు. వారికి వచ్చిన వీడియోకాల్స్ వివరాలను సేకరించారు. అనంతరం దర్యాప్తు ప్రారంభించా రు. వెంటనే స్పందించి భారీ ఆర్థిక నష్టాన్ని నివారించారంటూ డీఎస్పీ అశో క్‌బాబు, సీఐ జితేందర్‌ను టీజీసీఎస్బీ డైరెక్టర్ షికా గోయల్ ప్రశంసించారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బూర్గంపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల పేరుతో అనుమతులు లేకుండా గోదావరి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం నాగినేనిప్రోలు గ్రామస్థులు అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు అక్కడికి చేరుకున్నారు. అనుమతులు లేకుండా అభివృద్ధి పనులకు ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లును గుర్తించి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

మా భూమి మాకు చూపించండి



తహసీల్దార్ కార్యాలయంలో రైతు దంపతుల నిరసన

» తహసీల్ ఆఫీసులో రైతు దంపతుల నిరసన

» తమ భూమి తమకు చూపించాలని వేడుకోలు

నేలకొండపల్లినవంబరు24(ఆంధ్రజ్యోతి): తన భూమిని తనకు చూపాలని.. 2013నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తనకు న్యాయం జరగడం లేదని ఆరోపిస్తూ మండలంలోని గువ్వలగూడెం గ్రామానికి చెందిన రైతు దంపతులు కొలిపాక రామదాసు, భారతమ్మలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం గడపలో పడుకొని నిరసన తెలిపారు. సోమవారం జరిగే ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చిన రైతు దంపతులకు.. అధికారులు అందుబాటులో లేకపోవడంతో రైతు దంపతులు నిరసనకు దిగారు. బాధితుల కథనం ప్రకారం.. గువ్వలగూడెం రెవెన్యూలో రామాదాసు, భారతమ్మలకు సర్వే నెంబరు 229లో ఎ2.36కుంటలు ఉండాలని రైతు రామదాసు చెబుతున్నాడు. కానీ 2.01 భూమి మాత్రమే ఉందని, మిగిలిన భూమి పక్క రైతు భూమిలో కలిసిందని ఆరోపిస్తున్నాడు. ఈ విషయమై తన భూమి తనకు చూపాలని హైకోర్టు తహసీల్దార్‌ను ఆదేశించినప్పటికీ.. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించాడు. అధికారులు సర్వే చేసినప్పటికీ తప్పుడు నివేదికలిచ్చి తనకు అన్యాయం చేశారని వాపోయాడు. సర్వే తప్పు అని, తిరిగి సర్వే చేసి తనకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నాడు. 2013 నుంచి ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా.. తనకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. గత్యంతరం లేకనే తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసనకు దిగామని రామదాసు దంపతులు చెప్పారు.

సర్వే చేయించాం.. : తహసీల్దార్ వెంకటేశ్వర్లు

హైకోర్టు ఆదేశాల ప్రకారం గువ్వలగూడెం రైతు కొలిపాక రామదాసు, భారతమ్మల భూమిని సర్వే చేయించామని తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు చెప్పారు. సర్వే నివేదికను రైతుకు ఇచ్చామని చెప్పారు. అతనికి పాస్ పుస్తకంలో ఉన్న ప్రకారం ఎ2.01కుంటల భూమి ఉందన్నారు. కానీ సర్వే అధికారులు చేసిన సర్వే తప్పుడిదని, తిరిగి సర్వే చేయాలని రైతు రామదాసు కోరుతున్నాడన్నారు. తనకు ఇంకా 0.35 కుంటల భూమి తక్కువగా ఉందంటున్నాడని, అందువల్ల తిరిగి సర్వే చేయించడానికి తమకు అభ్యంతరం లేదన్నారు.

నాకు తెలియకుండానే... నా భూమి తాకట్టు!

కలెక్టర్ కాళ్లపై పడిన బాధితురాలు.. వారించిన సిబ్బంది

ఖమ్మం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో మొర

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 'సార్.. నా అవసరానికి డబ్బు ఇచ్చి.. నాకు తెలియకుండానే నా భూమిని తాకట్టు పెట్టుకుని భూమిలోకి పోనివ్వకుండా అడ్డుకుంటున్నారు. దీనిపై విచారించి న్యాయం చేయండి' అంటూ ఓ బాధితురాలు కలెక్టర్ కాళ్లపై పడి వేడుకుంది. ఈ క్రమంలో అక్కడి సిబ్బంది వెంటనే తేరుకుని ఆమెను వారించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్)లో వైరా మండలం విప్పలమడకకు చెందిన సుమారు 50ఏళ్ల వయసున్న తేళ్లూరి నాగేంద్రమ్మ కలెక్టర్‌కు విన్నవించిన వివరాలు ఇవీ. తన భర్త తేళ్లూరి బుచ్చాలు పేరుతో విప్పలమడక గ్రామసర్వేనెంబర్ 102/ఈ1/2లో ఎకరం భూమి ఉందని, తన భర్త చనిపోయాడని, తన కుమారుడు రాజా ఆరేళ్ల క్రితం ప్రాణాపాయస్థితిలో ఉన్న సమయంలో ఆస్పత్రి ఖర్చుల కోసం తనకు అల్లుడి వరసైన వెంకటేశ్వర్లు రూ.లక్ష తీసుకొచ్చి ఇచ్చాడని తెలిపింది. కానీ తన కుమారుడు చనిపోయాడని, తొలుత డబ్బు తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పిన వెంకటేశ్వర్లు ఆ తర్వాత తమ భూమిలోకి రావడమే కాకుండా.. వేరే వ్యక్తికి కౌలుకు ఇచ్చుకుంటూ తనను తన భూమిలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే విషయమే ఆరేళ్లుగా వైరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని.. నాలుగేళ్లుగా కలెక్టర్ల చుట్టూ తిరిగినా తన గోడును పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేసింది. అయితే ప్రజావాణిలో ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చిన వారితో పాటు వరసలో నిలుచున్న నాగేంద్రమ్మ తన వంతు వచ్చిన సమయంలో ఒక్కసారిగా కలెక్టర్ కాళ్లపై పడి రోదించడంతో కలెక్టర్ విస్తుపోయారు. అప్రమత్తమైన గన్‌మెన్లు, పోలీసులు ఆమెను వారించారు. అనంతరం ఆమె సమస్యను విన్న కలెక్టర్.. వివాదాన్ని డీఆర్వో పద్మశ్రీకి అప్పగించారు. న్యాయపరమైన వివరాలను సేకరించి న్యాయం చేస్తామంటూ బాధితురాలికి నచ్చజెప్పడంతో ఆమె వెళ్లిపోయింది.



కలెక్టర్ కాళ్లపై పడగా.. వారిస్తున్న సిబ్బంది

విద్యార్థిని దూషించిన లెక్చరర్

మనోవేదనతో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కారేపల్లి జూనియర్ కళాశాలలో ఆలస్యంగా వెలుగులోకి..

కారేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఓ లెక్చరర్.. విద్యార్థి పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు దుర్భాషలాడటంతో మనోవేదన చెందిన విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన ఖమ్మం జిల్లా కారేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగింది. సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలవీ.. కామేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రోజూ ఇంటి నుంచి రాకపోకలు సాగించే ఆ విద్యార్థి రోజూ లాగే శుక్రవారం కూడా కళాశాల సమయం అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన స్టడీ అవర్‌కు హాజరయ్యాడు. చీకటి పడితే తన గ్రామానికి వెళ్లేందుకు ఇబ్బంది అవుతోందని, తనను త్వరగా ఇంటికి పంపాలని అక్కడ విద్యార్థులను చదివిస్తున్న ఓ లెక్చరర్‌ను కోరాడు. ఈ క్రమంలో అసలు స్టడీఅవర్‌తో సంబంధం లేని ఇంగ్లీష్ లెక్చరర్ జోక్యం చేసుకుని ఆ విద్యార్థి పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. అసభ్యకరమైన పదాలతో దూషించి నెట్టివేశాడు. దీంతో తోటి విద్యార్థుల ముందు అవమానానికి గురయ్యానన్న మనోవేదన చెందిన ఆ విద్యార్థి కళాశాల నుంచి బయటకు వచ్చి రోడ్డుపై వెళ్తున్న లారీ కిందపడి ఆత్మహత్య చేసుకోవడానికి పరుగెత్తాడు. దాన్ని గమనించిన అదే కళాశాలలో చదువుతున్న అతడి సోదరుడు, తోటి విద్యార్థులు పట్టుకున్నారు. అనంతరం ఇంటికి వెళ్లిన సదరు విద్యార్థి రాత్రంతా ఏడుస్తూ ఉండగా.. తల్లిదండ్రులు ఆరా తీయడంతో విషయం చెప్పాడు. దాంతో సోమవారం తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి సదరు లెక్చరర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ విజయకుమారిని వివరణ కోరగా.. విషయం తన దృష్టికి వచ్చిందని, విద్యార్థి పట్ల దురుసుగా ప్రవర్తించిన ఇంగ్లీష్ లెక్చరర్‌కు మెమో జారీ చేస్తున్నామన్నారు. అయితే సదరు ఇంగ్లీష్ లెక్చరర్ పలుమార్లు కొందరు విద్యార్థినుల పట్ల కూడా ఇలాగే ప్రవర్తించాడని, అప్పుడు కూడా అధికారులు మెమో జారీ చేశారని తెలిసింది.



పోలీసు వాహనాలను తనిఖీ చేస్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్

పోలీసు వాహనాలు కండీషన్‌లో ఉండాలి

భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): పోలీసు వాహనాలు ఎల్లప్పుడూ కండిషన్‌లో ఉండాలని.. డ్రైవర్లు తమ వాహనాల పట్ల శ్రద్ధ తీసుకొని అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. సోమవారం హేమచంద్రపురంలోని హెడ్‌క్వార్టర్స్‌లో ఆయన పోలీసు వాహనాలను పరిశీలించి మాట్లాడారు. అనంతరం ఎంటీవో ఆర్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసు వాహనాలను ఎస్పీ తనిఖీ చేశారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలోని అధికారుల వాహనాలను తనిఖీ చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని అన్ని పోలీసు వాహనాలను మంచి కండిషన్‌లో ఉంచుకోవాలని డ్రైవర్లకు సూచించారు. డ్రైవర్లు తమ విధుల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహన తనిఖీల సమయాల్లో తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో విధులు నిర్వర్తించేటప్పుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల పరంగా ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ అడ్మిన్ లాల్‌బాబు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చూపిన బాటలో నడిచిన వారికి..

రాజకీయాల్లో తిరుగుండదు

(5వ పేజీ తరువాయి)

నాయకుడు వాసిరెడ్డి రామనాథం, చెరుకూరి రాజేశ్వరరావు, కేతినేని హరీష్ తదితరులు ప్రసంగించారు.

గ్రామంలో పండుగ వాతావరణం..

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సందర్భంగా దారుక బంజర గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది. కార్యక్రమానికి తెలంగాణతో పాటుగా ఏపీలోని పలు ప్రాంతాల నుంచి టీడీపీ రాష్ట్ర, జిల్లా మండల స్థాయి నాయకులు కూడా తరలి వచ్చారు. కల్లూరు నుంచి నేరుగా దారుక బంజర గ్రామం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు ఎస్కే ఖాదర్, కొంగర రామకృష్ణ, చావా వెంకటేశ్వరరావు, ఉన్నం రాజా, ఎస్కే షమీ, మందడపు సుమంత్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ దేవి, పసుమర్తి చందర్‌రావు, కల్లూరు మండల టీడీపీ, కాంగ్రెస్ నాయకులు జాస్తి శ్రీనువాసరావు, కాకర్ల రంగారావు, నారపరెడ్డి, ఈవూరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుమ్మల



సమావేశంలో పాల్గొన్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

అశ్వాపురం,నవంబరు24(ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధికారులు సమన్వయంతో కృషి చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గౌతమీనగర్ కాలనీ అతిథి గృహంలో ప్రతీ ఏడాది నిర్వహించే హెవీ వాటర్ ప్లాంట్ ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆఫ్‌సైట్ ఛైర్మన్‌గా, ప్లాంట్ జీఎం శ్రీనివాస్ ఆన్‌సైట్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ప్రమాదాల నివారణకు ప్లాంట్ యాజమాన్యం చేపడుతున్న భద్రతా చర్యలను అధికారులు.. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆఫ్‌సైట్ ఛైర్మన్‌కు వివరించారు. అనంతరం నిజంగా ప్లాంట్ నుంచి హైడ్రోజన్ సల్ఫైడ్ విష వాయువు విడుదలైనట్లు ప్రకటించి ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ పరిధిలోని జగ్గారం, మిట్టగూడెం గ్రామాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మాక్‌డ్రిల్ అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్‌ను క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ గ్రామాల ప్రజల్లో నిత్యం రక్షణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ప్లాంట్ అధికారులు, ప్రభుత్వ అధికారులు ప్రమాదాలు జరిగినప్పుడు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో డీజీఎంలు జగన్నాధశర్మ, తిరుమలరావురఫిక్ మహ్మద్, సీఏఓ వేణు, తహసీల్దార్ మణిధర్, సీఐ అశోక్‌రెడ్డి, ఎంపీఈవో ముత్యాలరావు, మండల వైద్యాధికారిణి సంకీర్తన, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఘన సన్మానం

జల్‌సంచయ్ జన్‌భాగీదారీ కార్యక్రమం విజయవంతంగా పూర్తిచేసి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా జాతీయస్థాయి అవార్డు అందుకున్న కలెక్టర్ జితేష్‌విపాటిల్‌ను ప్లాంట్ అధికారులు ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

కార్మికుల బీమా పెంపు పోస్టర్ ఆవిష్కరణ

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన బీమా పెంపు వివరణలను ప్రజలకు చేరువ చేయడంలో భాగంగా సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో కార్మికుల బీమా పెంపు గోడపత్రికను కలెక్టర్ జితేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల భద్రతను బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

అధ్యాపకుల మధ్య ఆధిపత్య పోరు



సింగరేణి మహిళా కళాశాల

» సింగరేణి జూనియర్ కళాశాలలో కుమ్ములాటలు
» జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు
» విచారణ ప్రారంభించిన పోలీసులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజానికి, భావితరాలకు మార్గదర్శకులుగా ఉండే అధ్యాపకుల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. రెండు వర్గాలుగా చీలి ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. సింగరేణి సంస్థలు, అధికారుల దృష్టికి కళాశాల సమస్యలు తీసుకువెళ్లినప్పటికీ.. ఎలాంటి ప్రభావం లేకపోవడం తో కళాశాలకు సంబంధించిన కొందరు అధ్యాపకులు తమ సమస్యలను నేరుగా జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు కొత్తగూడెం డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు విచారణ చేపట్టారు.

కొత్తగూడెంలోని సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలో గత కొన్ని సంవత్సరాలుగా అధ్యాపకుల మధ్య అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్నాయి. ఒకరిపై ఒకరు ఆధిపత్య పోరు, వర్గాలుగా విడిపోయి.. పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం అలవాటుగా మారింది. కళాశాలలో జరిగే సంఘటనపై ఖచ్చితంగా కింది స్థాయిలోనే పరిష్కరిస్తే సరిపోయేదని, చివరకు ఉన్నత స్థాయికి వెళ్లడం దురదృష్టకరమని మరికొందరు అధ్యాపకులు అభిప్రాయపడుతున్నారు. అధ్యాపకుల మధ్య కుమ్ములాటలు, ఆధిపత్య పోరులో భాగంగా సింగరేణి ఎడ్యుకేషన్ సంస్థలో ఇద్దరు అధికారులు బదిలీ అయ్యారు. దీని వెనుక ఒకరిద్దరు అధ్యాపకులే కారణమన్న చర్చ ఉద్యోగుల్లో కొనసాగుతోంది. ఇరు వర్గాల మధ్య బేధాభిప్రాయం వల్ల ఒక వర్గం మరొక వర్గానికి చెందిన అధ్యాపకులపై వేధింపులు ప్రారంభించడం.. ఈ ప్రక్రియ వెనుక ఒకరిద్దరు అధ్యాపకులు ఉన్నారన్న విషయమై ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. దీని పర్యావసనమే ఏకంగా జాతీయ ఎస్టీ కమిషన్ వరకు ఫిర్యాదు వెళ్లినట్లు తెలిసింది. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ ఒకరు విద్యార్థులకు వచ్చిన స్కాలర్‌షిప్ కుంభకోణంలో సస్పెండ్ అయినట్లు తెలిసింది. ఆ స్కాలర్‌షిప్ సొమ్ములను తిరిగి రాబట్టినట్లు తెలిసింది. ఆ తర్వాత కూడా చాలా కాలం వరకు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయలేదని తెలిసింది. అధికారుల జోక్యంతో కొందరు విద్యార్థుల అడ్రస్సులు తెలుసుకుని పంపిణీ చేశారు. అయితే కొందరు స్టూడెంట్స్ అడ్రస్సులు తెలియలేదని, దీంతో ఆ సొమ్మును కళాశాల ఖాతాలోకి మళ్లించినట్లు తెలిసింది. పేద విద్యార్థులకు అందజేయాల్సిన స్కాలర్‌షిప్స్ సొమ్మును కళాశాల ఖాతాలో జమ కావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఒక అధ్యాపకురాలిని నిబంధనలకు విరుద్ధంగా నియమించినట్లు కూడా తెలిసింది. ఒకప్పుడు ఎంతో పేరుగాంచిన సింగరేణి విద్యా సంస్థలు ప్రస్తుతం వివాదాలతో రోడ్డుకెక్కాయి. ప్రస్తుతం కళాశాల అధ్యాపకుల మధ్య పోరు జాతీయ స్థాయి ఎస్టీ కమిషన్ వరకు వెళ్లడంతో కొత్తగూడెం డీఎస్పీ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభం కావడం సంస్థకు తలనొప్పిగా మారింది. ఇది ఇలా ఉండగా.. ఒక వర్గానికి సింగరేణి సంస్థలో ఉన్న ఓ అధికారి గాడ్ ఫాదర్‌గా వ్యవహరిస్తున్నారన్న చర్చ తెరపైకి వచ్చింది.

● దుష్ట శక్తుల నివారణకు జంతుబలి ?

సింగరేణి జూనియర్ కళాశాలలో దుష్ట శక్తుల నివారణ కోసం ఓ జంతువుని బలి కూడా ఇచ్చినట్లు తెలిసింది. ఈ ఏడాది ఆగస్టు నెలలో ఈ సంఘటన చోటు చేసుకుంది. కళాశాలలో జంతువులు బలి ఇవ్వడమే కాకుండా ఆ జంతువును బయటకు తీసుకువెళ్లి వండుకుని తిరిగి కళాశాలలో ఆరగించినట్లు సమాచారం. ఎక్కడ రక్తం మరకలు కనిపించకుండా సదరు ఇద్దరు వ్యక్తులు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయం బయటికి రావడంతో బలి విషయమై సింగరేణి సెక్యూరిటీ ఆ ఇద్దరు వ్యక్తులను విచారించినట్లు తెలిసింది. అయితే జంతువు బలి సమయంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం గమనార్హం.

● సింగరేణి విద్య కార్యదర్శి ఏమంటున్నారంటే..

సింగరేణి విద్యా సంస్థలకు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదు వచ్చినా.. తక్షణమే పరిష్కరిస్తామని సింగరేణి విద్యా సంస్థల కార్యదర్శి వెంకటాచారి తెలిపారు. ఇటీవలే పదవీ బాధ్యతలు తీసుకున్నానన్నారు. ఫిర్యాదులు వచ్చినా తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. అవసరమైతే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.



మంత్రి తుమ్మలను కలిసిన అధికారులు

తుమ్మలను కలిసిన అధికారులు

సమన్వయంతో ముందుకు సాగాలన్న మంత్రి

దమ్మపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గండుగులపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. కల్లూరు ఏసీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వసుంధర యాదవ్, సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సత్తుపల్లి నియోజకవర్గానికి మంచి పేరు తెచ్చే విధంగా బాధ్యతలు నిర్వహించాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేస్తూ అభివృద్ధిలో ముందుండాలని కోరారు. అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని అన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. తాను ఎక్కడ ఉన్నా తన సొంత మండలంతో పాటు సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో అగ్రభాగాన ఉండాలన్నారు. ఆ లక్ష్యం దిశగా తన కృషి ఉంటుందని అన్నారు.

నేడు కొత్తగూడెంలో ఉమ్మడి జిల్లా

జూనియర్ వాలీబాల్ పోటీలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా జూనియర్ వాలీబాల్ పోటీలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్లు కె.వీరేష్, సిహెచ్. కాంతారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల జూనియర్ బాల, బాలికల వాలీబాల్ జట్లను ఎంపికలకు కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు చేశామన్నారు. ఇందులో పాల్గొనే వారి వయసు 01-01-2008 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. కావున ఈ ఎంపికలకు అభ్యర్థులు సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు, ఆరు ఫోటోలతో హాజరు కావాలసిందిగా కోరారు. కావున క్రీడాకారులు ఉదయం 9:30 గంటలకు ప్రకాశం స్టేడియం వాలీబాల్ కోర్టుకు సకాలంలో హాజరు కావాల్సిందిగా తెలిపారు. మరిన్ని వివరాలకు 9490331629, 9908165033 ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్లు వీరేష్, కాంతారావు కోరారు.

లంచావతారులతో ప్రజల బెంబేలు

» చంద్రుగొండలో అవినీతిపరులపై ఏసీబీ నజర్
» ముఖ్యనేత జోక్యంతో బయటపడ్డ ఓ అధికారి

చంద్రుగొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో పలువురు అవినీతి అధికారులతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. ప్రతీ చిన్న పనికి పైసలు ఇస్తేనే పని చేస్తున్నారు. ఒకవేళ ఎవరైనా ఇవ్వకుంటే రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు. వీరి ధన దాహాన్ని నిలవరించాలనే ఉద్దేశంతో కొందరు లంచావతారులపై మండలంలోని పలువురు ఇటీవల అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కి ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల ఒక అధికారికి కొందరు బాధితులు వల విసరగా.. ఓ ముఖ్య నేతకు ఈ విషయం తెలిసి సదరు వ్యక్తులను వారించినట్లు తెలిసింది. 20మందికి సంబంధించి ఈ వ్యవహారంలో సదరు అధికారి భారీగా డిమాండ్ చేయగా.. అంత ఇవ్వలేం, కొంత తగ్గించాలని సదరు వ్యక్తులు కోరారు. ఇందుకు ఆ అధికారి ససేమిరా అనడంతో.. ఏసీబీకి పట్టించాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం ముఖ్యనేతకు తెలియడంతో ఆ ప్రయత్నాన్ని విరమింపచేశారు. ప్రస్తుతం అదే అధికారిపై మరికొందరు గురిపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా మరికొందరు అధికారులు, సిబ్బంది ప్రతీ పనికి చేయి తడిపితేనే పని అవుతోంది. నిబంధలన మేరకు చేయాల్సిన పనులకు సైతం భారీగా పలువురు అధికారులు పెద్ద ఎత్తున డబ్బులు అడుగుతున్నారు. లేదంటే పక్కన పెడుతున్నారు. దీనిపై అధికారంలో ఉన్న పెద్ద నేతలు చెప్పినా స్థానిక అధికారులు కొందరు లెక్క చేయడం లేదు.

గతంలో ఏసీబీకి చిక్కిన ఇద్దరు అధికారులు

చంద్రుగొండ మండలంలో దీర్ఘకాలం పనిచేసిన ఇద్దరు అధికారులు గతంలో ఏసీబీకి పట్టుబడ్డారు. వీరిలో ఒకరు మండల వ్యవసాయశాఖ అధికారి కాగా.. మరొకరు విద్యుత్ శాఖ ఏఈ. వీరిద్దరికీ ప్రజల్లో మంచి పేరున్నా ఎరువుల డీలర్లు, రైతుల నుంచి అధిక లంచం డిమాండ్ చేయడం వల్లే వారిని ఏసీబీకి పట్టించినట్లు అప్పటి బాధితులు తెలిపారు. సదరు అధికారులుపై అధికారుల ధనదాహానికి బలైపోయారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు అదే పరిస్థితిని ప్రస్తుత అధికారులు అంతర్గతంగా ఎదుర్కొంటున్నారనే చర్చ సర్వత్రా జరుగుతోంది.

భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట

మాస్‌లైన్ నాయకుల ధర్నా

» ఆరు గ్యారెంటీల అమలు ఎప్పుడు ?
» మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన అన్ని రకాల పంటలను షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కె. రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. మండల కేంద్రాలలో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, 6 గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని, రైతులు పండించిన పత్తి పంటను ఎలాంటి ఆంక్షలు లేకుండా సీసీఐ కొనుగోలు చేయాలని, ఆసరా పెన్షన్లు పెంచి నూతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల హామీతో పాటు, 420 వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. రెండేళ్లు దాటి ముచ్చటగా మూడో ఏట ప్రవేశించే సందర్భంగా డిసెంబరు 9న సంబరాలు జరుపుకోబోతుందన్నారు. కానీ ప్రజల బతుకులు మాత్రం ఇప్పటికీ మారలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఆడ బిడ్డలకు రూ.2500, వృద్ధాప్య, వితంతువుల పెన్షన్లను రూ. 4000కు పెంచడం, వికలాంగులకు రూ. 3 వేల నుంచి 6 వేలకు పెంపు, రైతు రుణాల రద్దు, ఆటో కార్మికులకు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేల జీవన భృతి, నిరుద్యోగులకు నెలకు 3 వేల రూపాయల నిరుద్యోగ భృతి, పంటలకు బోనస్ సకాలంలో చెల్లించడం.. ఇవన్నీ అమలుకు నోచుకోలేదన్నారు. అదే విధంగా వర్షాలతో పత్తి, వరి, మొక్కజొన్న, సోయా తదితర పంటలు తడిసి పోయాయన్నారు. పత్తిని సీసీఐ కొనుగోలు చేయడానికి రైతులను ముప్పుతిప్పలు పెడుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి టీజేఎస్ రాష్ట్ర నాయకులు మల్లెల రామనాథం మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, సహాయ కార్యదర్శి నాయిని రాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కచ్చల కల్పన, జాటోజ్ కృష్ణ,మాచర్ల సత్యం, అమర్లపూడి రాము, నూప భాస్కర్. గోకినపల్లి ప్రభాకర్, ఆర్ మధుసూదన్ రెడ్డి, జిల్లా నాయకులు వై గోపాలరావు, భానోద్ ధర్మ, బుర్ర వెంకన్న, కలూరి కిషోర్, యాకూబ్ షావలి, లక్ష్మణ్. దుర్గక్క, వై సావిత్రి, నూప సరోజిని, వాసం బుచ్చిరాజు, సాయి, శివ, రామకృష్ణ, ఎల్ వీరభద్రం, నాగేశ్వరరావు, జ్యోతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

జీవితంపై విరక్తితో సొసైటీ మాజీ డైరెక్టర్ ఆత్మహత్య

తల్లాడ, నవంబరు24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్త వెంకటగిరి గ్రామ సొసైటీ మాజీ డైరెక్టర్ కే.జెమ్స్(66) జీవితంపై విరక్తితో ఆదివారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొంత కాలంగా జెమ్స్ మానసిక పరిస్థితి బాగోలేదు. ఈ దశలో జీవితంపై విరక్తి చెంది గత నెల 22వ తేదీన తనింటి వద్దే క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో కుటుంబసభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ శశికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. జెమ్స్ మృతదేహాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కాపాసుధాకర్, మాజీ ఛైర్మన్ దివ్వెల కృష్ణయ్య తదితరులు సోమవారం సందర్శించి నివాళులర్పించారు.



నిందితులను చూపుతున్న పోలీసులు

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

● రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఖమ్మం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): 50కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మంవన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో ఉన్న ఆటోస్టాండ్ వెనుక ఇద్దరు వ్యక్తులు రెండు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారని, వెంటనే ఎస్సై మౌలానా వారిని అదుపులోకి తీసుకుని విచారించారని తెలిపారు. ఒడిస్సా రాష్ట్రంలోని గజపతి జిల్లా తరంగడ గ్రామానికి చెందిన పుష్కర్ పరిచ్చ, అదే జిల్లాకు చెందిన సంతోష్‌పైకాఅనే ఇద్దరు ఒడిస్సా రాష్ట్రానికి చెందిన సందీప్ కుమార్ బుయా అనే వ్యక్తి వద్దనుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి పూణేలో నివాసం ఉండే అతుల్ సదాశివ్ ఆవాద్ అనే వ్యక్తికి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు సీఐ తెలిపారు. ఈనేపథ్యంలో ఆదివారం ఉదయం రెండు సూపర్ బ్యాగులతో 25కేజీల గంజాయి ప్యాకెట్లు తీసుకుని పలాస వద్ద కోణార్క్ రైలు ఎక్కి పూణేలోని అతుల్ సదాశివ్‌కు అమ్మేందుకు బయలుదేరారని తెలిపారు బోగీలను రైల్వేపోలీసులు తనిఖీచేస్తున్న నేపథ్యంలో ఇద్దరు నిందితులు ఖమ్మంలో దిగినట్టు సీఐ తెలిపారు. దీంతో వారి వద్ద నుంచి సుమారు రూ.25లక్షల విలువచేసే రూ.50.135కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని.. నిందితులను ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వివరించారు.

భూ వివాదంలో కత్తులతో దాడి



ఇరు వర్గాల మధ్య దాడి



గాయపడిన వెంకటేశ్వర్లును ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

» ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఖమ్మం ఆస్పత్రికి తరలింపు
» భద్రాద్రి జిల్లా నారంవారిగూడెంలో ఘటన

అశ్వారావుపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భూవివాదంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఓ వర్గం వారు కత్తులు, కర్రలతో దాడి చేయడంతో పచ్చని పొలంలో రక్తం చిమ్మింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలివీ.. భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన గేదెల విష్ణు కుటుంబసభ్యులు ఐదెకరాల భూమిలో ఎకరం భూమిని శ్రీహరి అనే వ్యక్తికి దాదాపు పదిహేనేళ్ల క్రితం విక్రయించారు. ఆ భూమిని దాదాపు నాలుగు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన మంగా గణేశ్ కుటుంబం కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకుంటోంది. అయితే ఆ భూమి తమదని, ఆధారాలు ఉన్నాయని, తమ భూమిని తమకు ఇవ్వాలని కోరుతూ విష్ణు కుటుంబసభ్యులు గణేష్ అనేవ్యక్తి కుటుంబంతో వివాదానికి దిగారు. ఈ క్రమంలో తాము కొనుగోలు చేసిన భూమిని ఎందుకు ఇస్తామంటూ గణేష్ కుటుంబం ఎదురు తిరగటంతో విష్ణు, గణేశ్ కుటుంబాల మధ్య వివాదం చెలరేగింది. 15రోజుల క్రితం గేదెల విష్ణు కుటుంబ సభ్యులు గణేష్ కుటుంబం వేసుకున్న అరటితోటను నరికారు. దీనిపై వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా అది విచారణలో ఉంది. ఇదే క్రమంలో సోమవారం మధ్యాహ్నం గేదెల విష్ణు కుటుంబసభ్యులు తన పామాయిల్ పొలం వద్ద ఉండగా అక్కడకు వెళ్లిన మంగా గణేశ్, అతడి సోదరుడు మంగా వెంకటేశ్వర్లు పొలం వివాదం గురించి మాట్లాడగా.. ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగింది. వివాదం చినికిచినికి గాలివానగా మారి.. విష్ణు, అతడి కుమారుడు సురేశ్, మనవడు వినయ్.. గణేష్, వెంకటేశ్వర్లుపై దాడిచేశాడు. పామాయిల్ పొలంలో పనికి వినియోగించే కత్తులు, కర్రలతో దాడి చేశారు. దీంతో వెంకటేశ్వర్లు, గణేశ్ తలకు గాయాలయ్యాయి. ఘటన జరుగుతున్న ప్రాంతానికి సమీపంలో ఉన్న గణేష్ బంధువులు ఇద్దరు దాడిని అడ్డుకునే ప్రయత్నం చేయగా.. విష్ణు కుటుంబసభ్యులు వారిని కూడా నెట్టివేశారు. ఆ తర్వాత గాయపడిన ఇద్దరిని అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ యయాతిరాజు ఘటన జరిగిన పొలం వద్దకు వచ్చి దాడిచేసిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విష్ణు కుటుంబసభ్యులు ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. అయితే విష్ణు కుటుంబం అమ్మిన ఎకరం భూమి ఇంకా పాస్‌బుక్‌లో విష్ణు కుటుంబం పేరుతోనే ఉందని, గణేష్ పేరిట రికార్డుల్లో నమోదు కాలేదని, ఈ నేపథ్యంలో వివాదం జరిగినట్టు తెలుస్తోంది.







ఘటనా స్థలంలో రాజాబాబు మృతదేహం

రాజాబాబు, రాజేశ్వరి (ఫైల్ ఫొటోలు)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

దుమ్ముగూడెం మండలంలో ఘటనలు

దుమ్ముగూడెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. బైరాగులపాడుకు చెందిన కొప్పుల రాజేశ్వరి(40) ఆదివారం సాయంత్రం ఇంటి ఎదుట ఆర్అండ్‌బీ రోడ్డు దాటుతుండగా.. చిననల్లబల్లికు చెందిన పూసం రాజేష్ తన ద్విచక్రవాహనాన్ని వేగంగా, అజాగ్రత్తతో నడిపి ఆమెను ఢీకొట్టాడు. తీవ్ర గాయాల పాలైన రాజేశ్వరి భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మరణించింది. ఎస్సై గణేష్ కేసు నమోదు చేశారు. అలాగే నందులచెలకకు చెందిన సోయం రాజాబాబు(26) సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో లక్ష్మీనగరం బ్యాంకుకు పనిపై వస్తూ బుర్రవేముల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తాను నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టాడు. స్థానికులు అతన్ని వెంటనే దుమ్ముగూడెం పీహెచ్‌సీకు తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యాధికారి ధ్రువీకరించారు. రాజాబాబు భద్రాచలం ఆర్టీసీ డిపోలో ఔట్‌సోర్సింగ్ మెకానిక్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్టు సమాచారం. సీఐ వెంకటప్పయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

కొత్తగూడెం లీగల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసులో నిందితుడికి ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 1000 రూపాయల జరిమానాను విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్. సరిత సోమవారం తీర్పునిచ్చారు. బూర్గంపాడు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన కల్తీ వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడినట్లు 2020, డిసెంబర్ 12న ఫిర్యాదు అందుకున్న బూర్గంపాడు స్టేషన్ హౌస్ అధికారి బాలకృష్ణ కేసు నమోదు చేశారు. ఈ కేసులో విచారణాధికారిగా అప్పటి సబ్ డివిజన్ పోలీసు అధికారి కేఆర్‌కె. ప్రసాదరావు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో మొత్తం 10మంది సాక్షులను విచారించిన తర్వాత నిందితుడు కల్తీ వెంకటేశ్వర్లుపై నేరం రుజువు కాగా.. ఏడేళ్ల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల సాధారణ కారాగార శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా కృషి చేసిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడి లక్ష్మీ, కోర్టు నోడల్ అధికారి ఎస్సై డి. రాఘవయ్య, లైజన్ అధికారి ఎస్. వీరభద్రం, కోర్టు డ్యూటీ అధికారి మహమ్మద్ అక్రమ్‌లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

సింగరేణి స్థలంలో అక్రమ నిర్మాణం తొలగింపు

ఆక్రమణలు సహించేది లేదన్న సిబ్బంది

ఇల్లెందు, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇల్లెందు పట్టణంలోని జేకే కార్మికవాడ ప్రధాన రహదారిపై సింగరేణి స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది సోమవారం తొలగించారు. సింగరేణి స్థలంలో ప్రయివేటు వ్యక్తులు చేపట్టిన నిర్మాణానికి సంబంధించిన సమాచారం స్థానికులు యాజమాన్యానికి ఫిర్యాదు చేయడంతో సెక్యూరిటీ సిబ్బంది నిర్మాణం జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ సిబ్బంది మాట్లాడుతూ సింగరేణి సంస్థకు చెందిన స్థలాలను ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు.



అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది



విద్యుత్‌శాఖ ఏఈలకు పదోన్నతులు

కూసుమంచి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కూసుమంచి సబ్‌డివిజన్‌లోని కూసుమంచి, నేలకొండపల్లి ఏఈలకు పదోన్నతులు లభించాయి. ఏడీఈలుగా పదోన్నతులు కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కూసుమంచి ఏఈ అశోక్‌ను మహబూబాబాద్ సర్కిల్ పరిధిలోని నెల్లికుదురు ఏడీఈగా బదిలీ అయ్యారు. నేలకొండపల్లి ఏఈగా పనిచేస్తున్న కుక్క రామారావుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు సబ్‌డివిజన్ ఏడీఈగా బదిలీ అయ్యారు. నేలకొండపల్లి సబ్‌ఇంజనీర్ అబ్దుల్ ఖదీర్‌కు కూసుమంచి ఏఏఈగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. నేలకొండపల్లి ఏఈ పోస్టు ఖాళీగా ఉంది.

పత్తి రైతు చిత్తు

- దిగుబడి రాక, చేలు దున్నుతున్న రైతులు
- పెసర, మొక్కజొన్న సాగుపై దృష్టి

కూసుమంచి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): పత్తిరైతులు ప్రత్నామ్నాయ పంటలవైపు దృష్టి పెట్టారు. పంటసాగు చేసినప్పటినుంచి ఇబ్బందులు పడిన రైతులు లాభం లేకపోవడంతో ప్రత్నామ్నాయ పంటలు సాగుకు ఉపక్రమిస్తున్నారు. పంటకాలం మరో నాలుగు నెలలు ఉన్నప్పటికీ పత్తిచేలు తొలగించి అదేభూమిలో పెసర, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. వానాకాలంలో భారీవర్షాలతో పత్తిపంట దెబ్బతినడం, భవిష్యత్తులో పంట కోలుకొని దిగుబడి వస్తుందనే నమ్మకం లేకపోవడంతో రైతులు పత్తిపంటను తొలగిస్తున్నారు. ఒకసారి పత్తి తీతపూర్తికాగానే ట్రాక్టర్ల సాయంతో పీకేస్తున్నారు.



కిష్టాపురంలో పత్తిచేలను ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతులు

అకాల వర్షాలతో చేల్లో ఊట

కూసుమంచి మండలంలో ఎక్కువగా పత్తి సాగుచేస్తుంటారు. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 7నుంచి8క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈసంవత్సరం ఆపరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటివరకు అకాలవర్షాలు, తుఫాన్ల ప్రభావంతో వర్షాలు పడుతూనే ఉన్నాయి. దీంతో ఊటనీరు పెరగడంతో పత్తిచేలు దెబ్బతిన్నాయి. ఒక్కసారి పత్తి తీయడంతోనే చేలన్నీ ఈడుబోయినట్లు కనిపిస్తున్నాయి.సాధారణంగా అయితే మార్చి నెలాఖరువరకు మూడు, నాలుగుసారు పత్తి తీస్తుంటారు. వర్షాల తాకిడికి చెట్లు ఎదుగుదల లోపించడం,ఆకులు పచ్చబడటం, ముడతపడటం, కాయలు నల్లబడటం జరిగింది. దీంతో పంట తొలగించడమే మేలనుకున్న రైతులు తొలగించి వాటిస్థానంలో ప్రత్నామ్నాయ పంటలసాగుకు ప్రయత్నిస్తున్నారు. ఎకరా పత్తిసాగుకు సుమారు రూ.30-35వేల వరకు పెట్టుబడి అవుతుందని నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఆరు ఎకరాల్లో పత్తి తొలగిస్తున్నా
పిట్టల కార్తీక్, యువరైతు, కిష్టాపురం

ఈ వానాకాలం సీజన్‌లో ఆరు ఎకరాల్లో పత్తిసాగు చేశాం. అధికంగా వర్షాలతో మొక్కల్లో ఎదుగుదల లేకపోవడం, ఆకులు ఎర్రబారడంతో పంట ఇప్పుడే ఈడుబోయినట్లు కనిపిస్తోంది. దీంతో పత్తిని పీకేసి పెసర వేయాలనుకున్నా. పత్తి వల్ల తీవ్ర నష్టం జరిగింది. యాసంగిలోనైనా ఎంతో కొంత గిట్టుబాటు అవుతుందని ఆశపడుతన్నాం.

జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సమీక్ష
- చేనేత వస్త్రాలకు ఆదరణ కల్పించాలి

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విధులను అధికారులు జవాబుదారీతనంతో నిర్వర్తించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉద్బోధించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణపై కలెక్టర్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. మండల ప్రత్యేక అధికారులుగా విధులు నిర్వహిస్తున్న జిల్లా అధికారులు ఆయా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రజావాణికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం మండల ప్రత్యేక అధికారులు పాఠశాలలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి అందించిన ఫీడ్‌బ్యాక్ నివేదికలను తీసుకోవాలని కలెక్టర్ డీఆర్వోకు సూచించారు.గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ రాబోతుందని, జిల్లా అధికారులు తమ పరిధిలోని సిబ్బంది ఎన్నికల విధులు పక్కాగా నిర్వహించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా అధికారులు, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ యం. అపూర్వ, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

చేనేత వస్త్రాలకు ఆదరణ కల్పించాలి

చేనేత వస్త్రాలకు ఆదరణ కల్పించేందుకు రూపొందించిన చేనేత లక్ష్మీ పొదుపు స్కీంను ప్రజలందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో చేనేత లక్ష్మీ పథకంపై జిల్లా అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం చేనేతలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తూ బట్టల కొనుగోలుకు నెలకు కొంతడబ్బు పొదుపు చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. చేనేత లక్ష్మీ పథకం క్రింద నెలకు రూ.500 చొప్పున 9 నెలల పాటు పొదుపు చేస్తే, ప్రభుత్వం 10వ నెల ముగిసిన తర్వాత 60 శాతం కలిపి టెస్కో షోరూమ్ నుంచి బట్టలు కొనుగోలు చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. ఆసక్తి గల జిల్లా అధికారులు, సిబ్బంది టెస్కో అందించే చేనేత లక్ష్మీ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ యం.అపూర్వ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, మేనేజర్ సంతోష్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ జరీన, ప్రతినిధులు ఎల్లా స్వామి పాల్గొన్నారు.

గడువులోపు ఫిర్యాదులు పరిష్కరించాలి

కమిషనర్ అభిషేక్ ఆగస్త్య

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన వినతులపై నిర్ణీత గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆదేశించారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి నేరుగా కమిషనర్ వినతులు స్వీకరించారు. నగరంలో నివాసాల చుట్టూ ఖాళీ స్థలాలు ఉండటంతో వర్షపు నీరు చేరి దోమలు, పిచ్చిమొక్కలు పెరిగి పాములు సంచరిస్తున్నాయని 10కిపైగా వినతులు అందాయి. అక్రమ కట్టడాలు తొలగించాలని, కొత్తగా ఇంటి నెంబర్లు కేటాయించాలని,అధిరంగా తాగునీటి, ఇంటి ట్యాక్స్ బిల్లులు వస్తున్నాయని ప్రజలు విన్నవించారు. విలీన ప్రాంతాల్లో కొత్తగా సీసీ రోడ్లు, డ్రైయినేజీలు నిర్మాణం చేయాలని 10కిపైగా వినతులు అందాయి. జమలాపురం కేశవరావు పార్కులోని జోనల్‌కార్యాలయం పాతమున్సిపల్ కార్యాలయంలోని జోనల్ ఆఫీస్ నుంచి ఒక్కో వినతులు అందాయి. బల్లేపల్లి జోనల్ కార్యాలయం నుంచి ఒక్క వినతి అందలేదు. అసిస్టెంట్ కమిషనర్ అనిల్, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుందర, ఇన్‌చార్జ్ ఈఈ ధరణి, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి పాల్గొన్నారు.

మరో జోనల్ సేవలకు సిద్ధం

- ఇప్పటికే నార్త్,సౌత్,వెస్ట్ జోనల్ కార్యాలయాల ద్వారా సేవలు
- మమత రోడ్డులో ఈస్ట్‌జోన్ కార్యాలయం సిద్ధం

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు స్థానికంగానే పౌరసేవలు అందించేందుకు జోనల్ కార్యాలయాల వ్యవస్థకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య శ్రీకారం చుట్టారు. ఆరునెలల్లోనే బల్లేపల్లిలో నార్త్‌జోన్,పాతమునిసిపల్‌కార్యాలయంలో సౌత్ జోన్, జమలాపురం కేశవరావు పార్కులో వెస్ట్ జోన్ కార్యాలయాలను ప్రారంభించారు. ప్రతీ జోనల్ కార్యాలయంలో పారిశుధ్యం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఉద్యనవనం ఇలా అన్నివిభాగాలతో కలిపి ఒక్కో జోనల్ కార్యాలయంలో 12నుంచి 15మంది ఉద్యోగులను కేటాయించారు. ఆమేరకు జోనల్ వ్యవస్థ గాడిలో పడుతోంది. ప్రతీపదినుంచి 15డివిజన్ల ప్రజలు స్థానికంగానే ఉన్న జోనల్ కార్యాలయానికి సమస్యలు చెప్పేందుకు అలవాటుపడుతున్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్

విలీన ప్రాంత ప్రజలకు చేరువుగా ఈస్ట్ జోన్

నగరంలో విలీనమైన ప్రాంతాలకు సమీపంలో మమతా రోడ్డు ప్రాంతంలో ఈస్ట్ జోన్ కార్యాలయం కార్యచరణ చేశారు. ఖమ్మం నగరానికి సుదూరంలో ఉన్న డివిజన్లు ఈస్ట్ జోన్ పరిధిలోకి రానున్నాయి. డివిజన్లు 11, 12, 13, 14, 15, 16, 17, 18, 19, 20, 21తో పాటుగా 22వ డివిజన్‌లో కొంతమేర ఈస్ట్‌జోన్ పరిధిలోకి రానున్నాయి. ఈమేరకు దాదాపుగా జోనల్‌కార్యాలయం రూట్‌మ్యాప్, నిర్మాణం పూర్తి చేసుకొంది. మరోవారలోఓ ఈస్ట్ జోన్ కార్యాలయం ద్వారా సేవలు అందనున్నాయి.

పరిశీలించిన కమిషనర్ అభిషేక్ ఆగస్త్య

ఈస్ట్‌జోన్ కార్యాలయాన్ని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం పరిశీలించారు.జోనల్ కార్యాలయంలో ఉద్యోగులకు సౌకర్యాలు, విభాగాలు కేటాయింపు, కార్యాలయానికి వచ్చే వారికి సౌకర్యాలపై పలు సూచనలు చేశారు. వారం రోజుల్లోగా పూర్తిస్థాయిలో నిర్మాణం కావాలని వచ్చే సోమవారం ప్రజావాణితో ఈస్ట్ జోనల్ కార్యాలయం ప్రారంభం కావాలని ఆదేశించారు.ఎస్ఈ రంజిత్, ఇన్‌చార్జ్ ఈఈ ధరణి వెంటున్నారు.

ఆయకట్టులో అయోమయం

(5వ పేజీ తరువాయి)

కృష్ణాపరివాహక ప్రాంతంలో జలాశయాలన్నీ నిండుకుండల్లా ఉన్నాయి. అయితే ముందస్తుగానే నీరు ఇస్తారా? లేదంటనే డిసెంబరు 10 తర్వాత ఇస్తారా? తెలియక గందరగోళపరిస్థితి ఉంది. నీటివిడుదలపై స్పష్టత ఇస్తే నార్లు పోసుకుని జనవరి మొదటివారానికి నాట్లు పూర్తిచేసుకోవాలని రైతులు యోచిస్తున్నారు. ఏప్రిల్ 15నాటికి పంటచేతికొస్తుందని, లేదంటే అకాలవర్షాల కారణంగా నష్టపోయేప్రమాదం ఉందని చెబుతున్నారు. అందుకే వెంటనే యాసంగి ప్రణాళిక ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

లేబర్‌కోడ్ పత్రాల దహనం

కూసుమంచి,నవంబరు24(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం తీసుకవచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్‌లు వెంటనే రద్దుచేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధానకార్యధ్య ఐ.వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం కూసుమంచిలో కార్మికులతో కలిసి నిరసనప్రదర్శనలో పాల్గొన్నారు. ఆర్డర్ కాపీలను తగులబెట్టారు. బీహార్ ఎన్నికల పర్యావసానంగా వచ్చిన విజయాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వం ఈప్రకటన చేసిందన్నారు. కార్మిక వ్యతిరేక మార్పులను మెజార్టీ ట్రేడ్ యూనియన్లు వ్యతిరేకిస్తున్నాయన్నారు. వెంటనే రద్దుచేసేవరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికసంఘనాయకులు గోపాల్, ప్రవీణ్, ఉపేందర్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట

తుంబూరు దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అన్ని పదకాల్లో పెద్దపీట వేస్తున్నదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడుతుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మహిళలకు దయాకర్ రెడ్డి ఇందిరమ్మ చీరెలను పంపిణీ చేశారు. కోరట్లగూడెం, రాజేశ్వరపురం, కోనాయగూడెం, నేలకొండపల్లి తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎమ్మార్వై అల్లం రవి, నాయకులు కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, బొడ్డు బొందయ్య, దండా పుల్లయ్య, బచ్చలకూరి నాగరాజు, తురక పాపయ్య, తన్నీరు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమే

ఖమ్మంరూరల్: మహిళలకు ఎల్లవేళలా అండగా ఉండేది కాంగ్రెస్‌ప్రభుత్వం మాత్రమే అని సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బండి జగదీష్ అన్నారు. మండల పరిధిలోని ఆరెంపుల గ్రామంలో ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరమ్మ చీరలను సోమవారం బండి జగదీష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బండి రవికుమార్, కే.రాధాకృష్ణ, మల్లిఖార్జున్, కృష్ణ, రవి, రమణ, సలీం, దావూద్, మేడిద మాధవి తదితరులు పాల్గొన్నారు.



కోరట్లగూడెం గ్రామంలో చీరలు పంపిణీ చేస్తున్న దయాకర్‌రెడ్డి

చిమ్మపూడిలో చీరల పంపిణీ

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చీరెల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం రఘునాథపాలెం మండలం చిమ్మపూడిలో ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ కన్వీనర్ దీప్లానాయక్, గ్రామకార్యదర్శి ఉదయ్ కుమార్, నాయకులు మహిళాకార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని 40 గ్రామంచాయతీల్లో సోమవారం ప్రభుత్వం అందించిన ఇందిరమ్మచీరలను స్వయంసహాయకసంఘాల సభ్యులు కాంగ్రెస్‌పార్టీనాయకులు అందించారు. ఈ కార్యక్రమంలోఏపీఎం కే.సంపత్‌కుమార్, ఏఎంసీ వైస్‌చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి, జడల నగేష్, ఉప్పనూతల నాగేశ్వరరావు, పోట్లకిరణ్, చామకూరి శ్రీనివాస్‌పాల్గొన్నారు.

పెరికలు ఐక్యతతో ముందుకెళ్లాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): పెరికి కులస్తులు ఐక్యతతో ఉండి ఇతర సామాజికవర్గాల వారందరిని కలుపుకుని ముందుకెళ్లాలని పెరికకుల (పురగిరిక్షత్రియ) కుల సేవాసంఘం రాష్ట్రఅధ్యక్షుడు ఘటిక విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఇటీవల జరిగిన చాంబర్‌ఆఫ్ కామర్స్ ఎన్నికల్లో గెలిచిన పెరిక కులస్తులను ఆసంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం చాంబర్ ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన బత్తిని నరసరావు, జాయింట్ సెక్రటరి బాదె రవి, బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడుగా బంధు సూర్యం, ఈసీమెంబర్లుగా మల్లెల అప్పారావు, సాదె శంకర్ యమ్మని ఉపేందర్, జుట్టు కొండ చైతన్యలను సన్మానించారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జవెల్లి సత్యనారాయణ, సుంకర ఆనంద్, దొంగరి వెంకటేశ్వర్లు, అందశ్రీను, సుందరి వీరభాస్కర్, బెడద సత్యనారాయణ, కార్పొరేటర్ గజ్జల లక్ష్మివెంకన్న, పత్తిపాకలత, పత్తిపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

జడ్పీ సీఈవో దీక్షారైనా

తిరుమలాయపాలెం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యలోనే విద్యార్థులు ఆంగ్లభాషపైపట్టు సాధించాలని, ప్రతివిద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యనభ్యసించే విధంగా చూడాలని జడ్పీ సీఈవో దీక్షారైనా తెలిపారు. సోమవారం మండలంలోని పిండిప్రోలు తిరుమలాయపాలెం ప్రీప్రైమరీ పాఠశాలన సందర్శించారు. ఎర్లీచైల్డ్ రీడ్‌ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులతో మాట్లాడారు ఈసందర్భంగా ఆమె బ్లాక్‌బోర్డుపై ఆంగ్లభాషపై విద్యార్థులకు ఉన్నపట్టును పరిశీలించారు. అంగన్‌వాడీ నుంచి ప్రీప్రైమరీ స్కూల్‌కు వచ్చిన వెంటనే ఆంగ్లభాషను సులభంగా చదివించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంవో బానోతుప్రవీణ్, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్ఎం వసంతరాణి, పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తిరుమలాయపాలెం,నవంబరు24(ఆంధ్రజ్యోతి):మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 42మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం తహసీల్దార్ లూథర్ విల్సన్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, డీటీసుధీర్, ఆర్ఐల లక్ష్మణ్, పవన్, మండడి ఇజ్రాయేల్ అందించారు.

మైలురాయిగా ఖమ్మం సభ

సీపీఐ జాతీయ నాయకురాలు పశ్య పద్మ

కూసుమంచి, నవంబరు 24(కూసుమంచి): ఖమ్మంనగరంలో ఈనెల 26న జరగబోయే శతాబ్ది ఉత్సవాల సభ దేశ చరిత్రలోనే మైలురాయిగా నిలువనుందని సీపీఐ జాతీయ నాయకురాలు పశ్య పద్మ తెలిపారు. శతాబ్ది ఉత్సవాలు విజయవంతం కోరుతూ బాసర నుంచి ప్రారంభమైన బస్సు ఖమ్మంజిల్లాకు చేరుకుంది. రాష్ట్రనాయకులు బాగం హేమంతరావు ఆధ్వర్యంలో బస్సుజాతాకు స్వాగతం పలికారు. కార్నర్ మీటింగ్‌లో పద్మ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయడంద్వారా కమ్యూనిస్టులు లేరని ప్రచారం చేసేవారికి కనువిప్పు కలగాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కారద్శ దండి సురేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్‌వలిఉల్లాఖాద్రి, జిల్లా నాయకులు కేతరాజు ఉప్పలయ్య, నరేంద్రప్రసాద్,గోవిందరావు,ఏనుగు వెంకటేశ్వర్లు, భాస్కర్,కమలాకర్, గుండెపొంగు మల్లేష్, భూక్యా నర్సింహ పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కులు : సీపీఐ

ఖమ్మంరూరల్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): సీపీఐ పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలిగామని పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. సోమవారంవరంగల్ క్రాస్ రోడ్డులో సీపీఐ శ్రేణులు ప్రచార జాతాకు సోమవారం స్వాగతం పలికారు.వరంగల్ క్రాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన అరుణపతాకాలను రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకురాలు పశ్య పద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వలీవుల్లా ఖాద్రి, రైతు సంఘం కోశాధికారి నరేంద్ర ప్రసాద్, మండల కార్యదర్శి పుచ్చకాయల సుదాకర్, నాయకులు పాల్గొన్నారు.

త్వరలో పండ్ల వ్యాపారులకు ప్రత్యేక మార్కెట్

కాంగ్రెస్ యువనేత తుమ్మల యుగంధర్

ఖమ్మంమార్కెట్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంకల్పంతో అతిత్వరలోనే నగరంలోని ఫ్రూట్ మర్చంట్స్‌కు ప్రత్యేకమార్కెట్ ఏర్పాటు కానుందని కాంగ్రెస్ యువనేత తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. సోమవారం హోల్‌సేల్ ఫ్రూట్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయసమ్మేళనంలో మాట్లాడారు.పండ్ల వ్యాపారులు ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న ప్రత్యేక ఫ్రూట్ మార్కెట్‌ను ఖానాపురం ఇండస్ట్రియల్ ఏరియాలో సుమారు మూడున్నర ఎకరాలుగుర్తించినట్లు తెలిపారు. త్వరలోనే మంత్రి తుమ్మల శంకుస్థాపన చేయనున్నారని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, కాంగ్రెస్ పార్టీనగరఅధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి,డిప్యూటీ మేయర్ పాతిమా జోహారా, కార్పొరేటర్ షౌకత్‌అలీ, ఫ్రూట్‌మర్చంట్స్ సంఘం బాద్యులు పాల్గొన్నారు.



యుగంధర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

దొడ్డిదారిన ఓట్ల నమోదు

- ఎన్నికల విభాగం కంప్యూటర్ ఆపరేటర్ తొలగింపు
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న కంప్యూటర్ అపరేటర్ పై స్థాయిలోని అధికారి లాగిన్ దుర్వినియోగం చేసి దొడ్డిదారిన ఓట్లు నమోదు చేయించారు. ఇటీవల ఓ ఎమ్మెల్సీ ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి ఫిర్యాదు చేయటంతో కమిషనర్ పూర్తి స్థాయిలో విచారణ చేశారు. కలెక్టర్‌కు నివేదికలు పంపారు. దొంగఓట్లు నమోదు చేసిన కంప్యూటర్ అపరేటర్‌ను విధుల నుంచి తొలగించారు. 2022లో ఖమ్మం నియోజకవర్గంలో లేని వారికి ఓట్లు కేటాయించారని పెద్ద ఎత్తున ఫిర్యాదులు నమోదు జరిగాయి. ఈ క్రమంలోమూడు నెలలుగా ఖమ్మం నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాల పరిశీలన చేస్తున్నారు. ఇదిలా ఉండగా చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన ఓట్లు ఖమ్మం నియోజకవర్గంలో ఓటర్లుగా గుర్తింపు పొందారని విమర్శలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య విచారణ నిర్వహించారు. అజయ్ పైస్థాయిలోని అధికారుల లాగిన్‌లను దుర్వినియోగం చేసి ఓటర్లు నమోదు చేశారని గుర్తించారు. దీంతో కంప్యూటర్ అపరేటర్‌పై ఖమ్మం రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేశారు.

కేఎంసీలో లాగిన్‌ల దుర్వినియోగం

సస్పెన్షన్‌కు గురైన కంప్యూటర్ అపరేటర్ పదేళ్లుగా రెవెన్యూశాఖలో ఎన్నికల విభాగంలో పని చేస్తున్నాడు. 2023లో ఖమ్మంఅర్బన్ తహసీల్దారు కార్యాలయంనుంచి ఖమ్మం నగర పాలక సంస్థలో ఎన్నికల విభాగానికి వచ్చారు. కేఎంసీలో కొంతమంది కంప్యూటర్ అపరేటర్లు(లాగిన్ దుర్వినియోగంతో ఉద్యోగాలు కోల్పోయిన వారు), డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఉద్యోగి అజయ్‌కు స్నేహితులుగా మారారు. వారి ప్రోద్బలంతోనే దొడ్డిదారిన ఓటర్లు నమోదుకు పాల్పడ్డాడని, చివరకు సస్పెన్షన్‌కు గురయ్యాడని చర్చ జరుగుతుంది.

ఆరుగ్యారంటీలు తక్షణమే అమలు చేయాలి

ఖమ్మంఅర్బన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారంటీల హామీలను వెంటనే అమలు చేయాలని మాస్‌లైన్ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మంలో నిరసన కార్యక్రమ నిర్వహించారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు సీవై పుల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు దాటుతున్నా నేటికీ ఆరుగ్యారంటీలను అమలు చేయటం లేదన్నారు. ఆందోళన కార్యక్రమంలో జి. రామయ్య,ఆవుల అశోక్,బందెల వెంకయ్య, ఆర్ శివలింగం, మలీదు నాగేశ్వరరావు, సీహెచ్ శిరోమణి, ఝాన్సీ, శోభ పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

తిరుమలాయపాలెం,నవంబరు24(ఆంధ్రజ్యోతి):మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీవో సీలార్‌సాహెబ్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో చేపపిల్లలను మత్స్యకారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఓర వెంకటేశ్వర్లు, తురక వేణు,కృష్ణ, దడిదల అశోక్, చింతల వెంకన్న, భద్రయ్య, మల్సూర్, రామనబోయిన వెంకటేశ్వర్లు, పంగ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కుల, మతహారితమే దేశసౌభాగ్యం

ఆర్మీ మాజీ జవాన్ మధఆర్

ఖమ్మంరూరల్,నవంబరు24(ఆంధ్రజ్యోతి):కుల,మతరహితమే ఈ దేశానికి సౌభాగ్యమనిఆర్మీమాజీజవాన్ షేక్.మదార్ అన్నారు. స్నేహానికి పేద, ధనిక, కులం, మతం అనేది అడ్డేకాదని మనుషలందరూ సమానమంటూ నిరూపించాడు. మండలంలోని కాచిరాజుగూడెం గ్రామానికి చెందిన మాజీ ఆర్మీజవాన్ షేక్ మదార్ చిన్ననాటి స్నేహితుడు శ్రీనివాస్ అయ్యప్పమాల ధరించడంతో, స్వాములకు ఇంట్లో సోమవారం అన్నదానం చేశారు.

సామినేని నిందితును అరెస్టు చేయాలి

ఖమ్మంఅర్బన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి):సీపీఎంమాజీ రాష్ట్ర నాయకులు సామినేని రామారావును హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ డిమాండ్ చేశారు. సోమవారం యల్లంపల్లి వెంకటరావు అధ్యక్షతన జరిగిన సీపీఎం త్రీటౌన్‌కమిటీ సమావేశంలో మాట్లాడారు. మంగళవారం జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యర్రాశ్రీనివాసరావు, భూక్యా శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ యర్రాగోపి, పత్తిపాక నాగసులోచన, షేక్ సైదులు పాల్గొన్నారు.



ఎర్రుపాలెంలో అదనపు కలెక్టర్ శ్రీజ పర్యటన

ఎర్రుపాలెం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనిగండ్లపాడు, ఎర్రుపాలెంగ్రామాల్లో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ సోమవారం పర్యటించారు. బనిగండ్లపాడులో నిర్మాణం జరుగుతున్న తెలంగాణ పబ్లిక్‌స్కూల్ పనులు పరిశీలించారు. మంజూరైన నిధులు సహకారంతో యుద్ధప్రాతిపదికన వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం జూనియర్ కాలేజీ తరగతి గదుల మరమ్మతు పనులను పరిశీలించారు. నిబంధనల ప్రకారం మరమ్మతులు జరగడం లేదని కాంట్రాక్టర్‌ను మందలించారు. అవగాహన లేమితో నిధులను వృధా చేయవద్దన్నారు. అనంతరం గ్రామంలో మహిళకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో బి.సురేందర్, ఎంపీవో శ్రీలక్ష్మి, ఎంఈవో మురళీమోహన్‌రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న గోపాలరావు

మధిర రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మధిర బోడేపూడి భవన్‌లో జరిగిన సీపీఎం టౌన్, మండల కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం నాయకులు శీలం నర్సింహారావు, మందా సైదులు, పాపినేని రాంనర్సయ్య, మందడపు ఉపేంద్ర వూట్ల శంకర్‌రావు పాల్గొన్నారు.

అక్రమాలు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

» లక్ష్మీపురం సొసైటీ చైర్మన్ వీరభద్రరావు

బోనకల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సొసైటీలో ఎరువుల పంపిణీ పకడ్బందీగా జరుగుతుందని, కొందరు కావాలనే అసత్యప్రచారం చేస్తున్నారని, అక్రమాలు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని లక్ష్మీపురం సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రరావు స్పష్టం చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సొసైటీ పరిధిలో ఎరువుల పంపిణీ ప్రశాంతంగా జరుగుతుండగా, కొంతమంది కాంగ్రెస్ నాయకులు పథకం ప్రకారం ఘర్షణలు సృష్టించారని ఆరోపించారు. యూరియా కొరత ఉన్న క్రమంలో తమ సొసైటీ పరిధిలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా అందించిన ఘనత తమ సొసైటీకే దక్కిందన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, కన్నెపోగు జయరాజు, ఆదూరి నాగేశ్వరరావు, షేక్.జానిమియా, పుచ్చకాయల తిరుపతయ్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

» మానసిక వైద్య నిపుణుడు సోహెల్

ముదిగొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని మానసిక వైద్యనిపుణుడు సోహెల్ సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి మత్తు పదార్థాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అంకం అరుణాదేవి, కాలేజీ ప్రిన్సిపాల్ గురవయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్లు, రాములు, మధుసూదన్‌రావు, లత, రెడ్డిబోయిన రామారావు పాల్గొన్నారు.

రబీ షెడ్యూల్ విడుదల చేయాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వైరా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు రబీ సీజన్‌కు సంబంధించి నీరు విడుదల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని కోరుతూ తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం వైరా నీటిపారుదలశాఖ అధికారులకు ఆయకట్టు రైతులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగునీరు విడుదలపై స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. నీటివిడుదలపై స్పష్టనిస్తూ షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, పారుపల్లి కృష్ణారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, షేక్.బిలాల్, గొల్లపూడి ప్రకాశరావు, వడ్లమూడి మధు పాల్గొన్నారు.

భక్తితో పాటు సేవా కార్యక్రమాలు

సత్తుపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలలో ఆధ్యాత్మిక భక్తిభావం పెంపొందించడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, భగవాన్ శ్రీ సత్యసాయి బాబా బోధనలు ఆదర్శప్రాయమని భక్తులు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి సత్తుపల్లిలోని శ్రీ సత్యసాయి సేవాసమితిలో భగవాన్ శ్రీ సత్యబాబా 100వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నిరుపేదలకు వారం రోజులకు సరిపడా నిత్యవసర సరుకులను అందజేశారు. ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు, ఆహారం అందించిన అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి భజనలు నిర్వహించారు.

రైతు మేళాకు విశేష స్పందన

వేంసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేంసూరు సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం రైతు మేళాకు రైతులు, వాహనదారుల నుంచి విశేష స్పందన వచ్చింది. సొసైటీ చైర్మన్ తక్కెళ్లపాటి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్‌బంకు వార్షికోత్సవం సందర్భంగా సోమ, మంగళవారాల్లో లీటరు పెట్రోల్, డీజిల్ ఉచితంగా అందించటం జరుగుతుందని ప్రకటించడంతో సొసైటీ పరిధిలోని రైతులతోపాటు వాహనదారులు క్యూకట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ గోపాలకృష్ణ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సొసైటీ ఆధ్వర్యంలో ఫెర్టిలైజర్ షాపుతోపాటు రెండు హార్వెస్టర్లను కొనుగోలు చేసి రైతుల సంక్షేమానికి పాటుపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో మందపాటి శ్రీనివాసరెడ్డి, ఇంజన్ ఆయిల్ సేల్స్ ఆఫీసర్ సుకేష్, డిస్ట్రిబ్యూటర్ ముత్యా పాల్గొన్నారు.



వీఎంఎస్ఆర్ మేళాలో పాల్గొన్న రైతులు, వాహనదారులు

ఆయకట్టులో అయోమయం

(5వ పేజీ తరువాయి)

కృష్ణాపరివాహక ప్రాంతంలో జలాశయాలన్నీ నిండుకుండల్లా ఉన్నాయి. అయితే ముందస్తుగానే నీరు ఇస్తారా? లేదంటే డిసెంబరు 10 తర్వాత ఇస్తారా? తెలియక గందరగోళపరిస్థితి ఉంది. నీటివిడుదలపై స్పష్టత ఇస్తే నార్లు పోసుకుని జనవరి మొదటివారానికి నాట్లు పూర్తి చేసుకోవాలని రైతులు యోచిస్తున్నారు.

ఏప్రిల్ 15నాటికి పంటచేతికొస్తుందని, లేదంటే అకాలవర్షాల కారణంగా నష్టపోయేప్రమాదం ఉందని చెబుతున్నారు. అందుకే వెంటనే యాసంగి ప్రణాళిక ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

వైకుంఠధామంలో సౌకర్యాల కరువు

» అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిన కాచారం శ్మశానవాటిక
» సౌకర్యాలలేమితో అవస్థలు పడుతున్న గ్రామస్థులు
» పట్టించుకోని అధికారులు

కొణిజర్ల, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఆర్భాటంగా నిర్మించిన వైకుంఠామంలో చివరి మజిలీకి తిప్పలు తప్పడం లేదు. కనీసం నీటి వసతి కూడా కరువైంది. ఆకతాయులకు పేకాట ఆడేందుకు నిలయంగా మారింది.



వైకుంఠధామంలో సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

శ్మశానవాటికలో వసతులు కల్పించకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కాచారం గ్రామ పంచాయతీలో నిర్మించిన శ్మశానవాటిక సమస్యలతో ఉంది. చివరి మజిలీకి వచ్చే ప్రజలకు నీటి సౌకర్యం కూడా లేదు. గతంలో వైకుంఠదామంలో నిర్మించిన బోరు పని చేయడంలేదు. దాంతో నీటి సమస్య తీవ్రంగా ఉంది. వైకుంఠదామం చుట్టూ ప్రహరీలేక, చేతిపంపులేక అవస్థలు పడుతున్నామని, ఇవేమి అధికారులకు పట్టడంలేదని స్థానికలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైకుంఠదామం ఎవరు పట్టించుకోకపోవడం వలన ఆక్రమణకు గురవుతుందని పేర్కొంటున్నారు. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పలువురు అసాంఘిక కార్యకలపాలకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.





కంపచెట్ల మధ్యలో ఉన్న వైకుంఠధామం

కనీస సౌకర్యాలు లేవు: జనార్దన్ స్థానికుడు



శ్మశానవాటికలో అంతక్రియలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. గుర్తుతెలియని వ్యక్తులు శ్మశానవాటికలో పేకాట ఆడుతున్నారు. చేతిపంపు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలి.

శ్మశానవాటికలో ఇబ్బందులు లేకుండా చూస్తాం: ఎంపీవో ఉపేంద్రయ్య

కాచారం గ్రామంలోని శ్మశానవాటికలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తాం. చేతి పంపు మర్మత్తులకు గురికావడంతో తీశారు. వెంటనే మరమ్మతులు చేసించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చేస్తాం. శ్మశానవాటికలో అ సాంఘిక కార్యకలాపాలు చేపడితే చట్టపరంగా ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటాం.

ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి

కల్లూరు, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): భవిషత్తును దృష్టిలో పెట్టుకొని మాజీ సీఎం నందమూరి తారక రామారావు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను నేటి యువతరం ముందకు తీసుకోవెళ్లాలని నందమూరి తనయుడు రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర టీడీపీ ఇన్‌చార్జి జనార్దన్ అన్నారు. సోమవారం కల్లూరులో కాంగ్రెస్ పార్టీ నాయకుడు లక్కినేని రమేష్ నివాస గృహంలో వారు మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమేష్ దంపతులు వారిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ తెలుగుజాతిని ప్రపంచ దేశాలకు చాటిన మహా వ్యక్తి అని చెప్పారు. భవిషత్ తరాలను దృష్టిలో ఉంచుకొని చేపట్టిన సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. వాటిని కొనసాగిస్తూ వారి ఆశయాలను ముందుకు తీసుకోవెళ్లటమే నేటి యువత కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకర్ల రంగారావు, జాస్తి శ్రీనివాసరావు, పోట్రు శ్రీనివాసరావు, తాళ్లూరి రమేష్, కిరణ్ పాల్గొన్నారు.



నందమూరి రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

రైతును రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయం

» వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు, నవంబరు24(ఆంధ్రజ్యోతి) : రైతులకు అన్నిరకాలుగా ఉపయోగపడే పనులను ఇందిరమ్మ ప్రభుత్వంచేస్తుదని రైతులను రాజుచేయడమే ప్రభుత్వ ధ్యేయమని వైరా ఎమ్మెల్యే మాలోతురాందాస్‌నాయక్ అన్నారు..సోమవారం స్థానిక వ్యవసాయమార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాంనాయక్, వైరా ఏడీఏ కరుణశ్రీ, ఏవో నరసింహారావు, తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, సొసైటీ సీఈవో నాగలక్ష్మి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, మహిళ అధ్యక్షురాలు కొప్పల ప్రభావతిరెడ్డి, మేడ ధర్మారావు, భూక్యాలాలునాయక్, వరదబోయని శ్రీనివాసరావు, పూర్ణకంటి మైసారావు, పటాన్ మజీద్‌ఖాన్, మాదినేని లిఎన్, నల్లమల శివకుమార్, తదితరులున్నారు.

కారేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తు ముందుకు పోతున్నట్లు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అదే విధంగా వెంకీట్యాతండాలో అదే గ్రామానికి చెందిన మంగశం సెక్షన్ కంపెనీ ఎండీ గుగులోత్ రాజేందర్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో రూ.3లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన డిజిటల్ ఏఐ విద్యబోధన తరగతులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో మల్లెల రవీందర్ ప్రసాద్, సీఐ సాగర్, ఎస్ఐ గోపి, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీపివాస్‌రావు, తలారి చంద్రప్రకాష్, బానోత్ దేవ్లా నాయక్, ఇమ్మడి తిరుపతిరావు, బానోత్ రాంమూర్తి, అడ్డగోడ అయిలయ్య, యాకుబ్ అలీ, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఏన్కూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

» సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సోమవారం రాత్రి సత్తుపల్లి పట్టణంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో రింగ్‌సెంటర్, పాతసెంటర్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన 4వే, 3వే ట్రాఫిక్ సిగ్నల్ లైట్ల వ్యవస్థను కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం యువసేవా సమితి వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ రాజు పుట్టిన రోజు సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో వృద్ధులకు రగ్గులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ టీ.శ్రీహరి, మునిసిపల్ కమీషనర్ కొండ్రా నర్సింహ, ఏఈ వీ.సురేష్ పాల్గొన్నారు.

కల్లూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి పేద మహిళ అభ్యున్నతి కోసం పాటు పడుతున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సోమవారం కల్లూరు ఏఎంసీ ప్రాంగణంలో ఇందిరమ్మ మహిళ శక్తి పథకం ద్వారా కల్లూరు, తల్లాడ మండలాల స్థాయిలో డ్వాక్రా మహిళ సభ్యులకు ఎమ్మెల్యే చీరలు పంపిణీ చేశారు. కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ మాట్లాడుతూ చీరల పంపిణీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, తల్లపురెడ్డి హనిమిరెడ్డి, తక్కెళ్లపాటి దుర్గాప్రసాద్, కాపా సుధాకర్, దగ్గుల రఘుపతి రెడ్డి, తహసిల్దార్ సాంబశివుడు, ఏపీఎంలు ఆశోకారాణి, రవికుమార్ పాల్గొన్నారు.



సత్తుపల్లిలో సిగ్నల్‌లైట్ల వ్యవస్థను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

వరి అవశేషాలను తగలబెట్టొద్దు

తల్లాడ, నవంబరు24(ఆంధ్రజ్యోతి): పొలాల్లో వరి పంట అవశేషాలను తగలబెట్టడం పర్యావరణం, ప్రజారోగ్యానికి తీవ్ర నష్టదాయకమని ఏవో ఎండీ తాజుద్దీన్ అన్నారు. సోమవారం మండలం మిట్టపల్లి , నూతన్‌కల్ గ్రామల్లో వరి పంట అవశేషాలను తగులబెట్టకూడదని రైతులకు అవగాహన కలిపించారు. ఈకార్యక్రమంలో ఏఈవో ఆర్.త్రివేణి, రైతులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం హయాంలోనే మధిర అభివృద్ధి

మధిర రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హయాంలోనే మధిర నియోజకవర్గం అభివృద్ధి చెందిందని కాంగ్రెస్ నాయకులు మాదాల రామారావు, చిలివేరు బుచ్చిరామ్ తెలిపారు. మాటూరుపేట-అంబారుపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి రూ.7.05కోట్లు మంజూరు చేయించారన్నారు. కొద్దిరోజుల్లో శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో సోమవారం శిలాఫలక ప్రాంతాన్ని వారు పరిశీలించారు. మాదాల రాంబాబు, నెల్లూరి రవి, విజయరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీపురం సొసైటీ పరిధిలో జరిగిన ఘర్షణపై ఫిర్యాదు చేశాం

బోనకల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం సొసైటీలో చైర్మన్ సీపీఎం పార్టీకి చెందిన రైతులకే యూరియాను పంపిణీ చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఉమ్మినేని బాబు, కల్యాణం నాగేశ్వరరావు, సాదం కొండలు తదితరులు ఆరోపించారు. సీపీఎం నాయకుల ప్రోత్సాహంతోనే సొసైటీలో సోమవారం ఘర్షణ జరిగిందని ఇందుకు సంబంధించి తాము పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామని విలేకరులకు తెలిపారు. అసత్య ప్రచారాలను వారు ఖండించారు. అందరితో సమన్వయంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

మోసపూరిత హామీలను ఇచ్చిన కాంగ్రెస్

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు

బోనకల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు ఆరోపించారు. మండలంలో ముష్టికుంట్ల గ్రామంలో సోమవారం జరిగిన సీపీఎం సీనియర్ నాయకుడు దారగాని ఏడుకొండలు సంస్మరణ సభలో ఆయన ప్రసంగించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి వెంకటేశ్వరరావు, కిలారు సురేష్, బందం శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సునీత, కొంగర వెంకటనారాయణ తదితరులున్నారు.

నిబంధనలు సడలించి పత్తి కొనుగోళ్లు చేయాలి

వైరా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తేమశాతం నిబంధనలు సడలించి సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం వైరాలో సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేశారు. యూరియా సరఫరా పెంచాలని, వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలని, పత్తి దిగుమతి సుంకం 11శాతం కొనసాగించాలని డిమాండ్ చేశారు. నాయకులు మద్దెల రవి, షేక్.ఖాసీం, చింతనిప్పు చలపతిరావు, తోట నాగేశ్వరరావు, గారపాటి అశోక్, సుంకర సుధాకర్, కురుగుంట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల అధికారులకు శిక్షణ

చింతకాని, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల నిర్వహణపై ఆర్వో మరియు ఏఆర్వోలకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైరా ట్రాన్స్‌కో ఏఈకి ఏడీఈగా ఉద్యోగోన్నతి



వైరా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైరాలో ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ)గా పనిచేస్తున్న పచ్చిగండ్ల సుందర్‌కుమార్‌కు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఏడీఈ)గా ఉద్యోగోన్నతి లభించింది. ఉద్యోగోన్నతి లభించిన వెంటనే సుందర్‌కుమార్‌ను భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల ఏడీఈగా నియమించారు. సుందర్‌కుమార్ వైరా డీఈ వై.రమేష్, ఏడీఈ పి.కిరణ్‌కుమార్, రూరల్ ఏఈ పి.వెంకటసాయి అభినందించారు.

వైరాలో మాజీ ఎంపీ నామ పర్యటన

వైరా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు సోమవారం వైరాలో పర్యటించారు. ఇటీవల వివాహం అయిన నాగబత్తిని భాస్కర్‌రావు, నాగవేణి దంపతుల తనయుడు నాగబత్తిని సత్యార్థి, ప్రమీల దంపతులను నామా ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఇటీవల గాయపడిన మాజీ సర్పంచ్ సక్కుబాయిని పరామర్శించారు. బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, షేక్.లాల్‌మహ్మద్, తాటిపూడి మాజీ సర్పంచ్ బట్టా పెద్ద భద్రయ్య, మాదదినేని దుర్గాప్రసాద్, గుజ్జర్లపూడి దేవరాజు, పాల్గొన్నారు.

ఇందిరమ్మ చీరల పంపిణీ

చింతకాని, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండ ల పరిధిలోని పలు గ్రామాల్లో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, కొప్పుల గోవిందరావు, మడుపల్లి భాస్కర్, బందెల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



నాగులవంచ గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీని చేస్తున్న అధికారులు

ధ్యానంతోనే ప్రశాంతత

సత్తుపల్లిరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, ఉపాధ్యాయులు ధ్యానం చేయడం వలన ప్రశాంతతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని రిటైర్డ్ డీఐఈఓ ఎంటీ.వెంకటేశ్వరుడు అన్నారు. సోమవారం సత్తుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రీ రామకృష్ణ మిషన్ ఆధ్వర్యాన హార్ట్ ఫుల్ నెస్ కార్యక్రమం నిర్వహించారు. ధ్యానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించాలి : బీజేపీ

సత్తుపల్లిరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అందరిలో దేశభక్తిని పెంపొందించేందుకు సామూహిక వందేమాతరం కార్యక్రమం చేపట్టినట్లు బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. వందేమాతరం గేయాన్ని బంకించంద్ర ఛటర్జీ రచించి 150ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం సత్తుపల్లిలో జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించి రింగ్‌సెంటర్‌లో సామూహికంగా వందేమాతర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఈవీ.రమేష్, నాయుడు రాఘవరావు, పాలా నాగసురేందర్‌రెడ్డి, సుదర్శన్‌మిశ్రా, భాస్కర్ల వీరంరాజు, సాలి శివకృష్ణ, జొన్నలగడ్డ నరేష్, మేరుగు శేషగిరి, పడిగల మధుసూదనరావు, వసంతరావు, నల్లమోతు నాని పాల్గొన్నారు.